అప్పు మిగిల్చిన విషాదం
కుటుంబం ఆత్మహత్యాయత్నం..
భర్త మృతి..చికిత్స పొందుతున్న భార్య, పిల్లలు
■ లోపలి పేజీలో..

లెక్క తేల్చేలా!

- ఇక నిరంతరాయంగా భూముల రీ సర్వే
- మొదటి విడతలో 4 గ్రామాల్లో పూర్తి.. రెండో విడత జూన్ నెలాఖరు పూర్తికి యత్నాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



రీ సర్వేను పర్యవేక్షిస్తున్న ల్యాండ్ సర్వేశాఖ ఏడీ అన్సారీ

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల లెక్కను పక్కాగా తేల్చాలని నిర్ణయించింది. రీ సర్వేను ఈ ఏడాది జనవరి 20న తొలి దశలో చేపట్టారు. ఏప్రిల్ రెండో దశకు శ్రీకారం చుట్టారు. రోవర్ల కొరత, రెవెన్యూ అధికారుల నిర్లిప్తతతో రెండో దఫా కొత్త నత్తనడకన సాగినా ఈ దశలోనూ 30 గ్రామాల్లో రీ సర్వే పూర్తికి అధికారులు నడుం బిగించారు. జూన్ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియను ఒక కొలిక్కి తీసుకు రావడానికి యంత్రాంగం సన్నద్ధం అవుతోంది.

రాష్ట్ర భూపరిపాలనశాఖ కమిషనర్ (సీసీఎల్‌ఏ) ఆదేశాలతో జిల్లాలో తొలి విడతలో పైలెట్‌గా 24 గ్రామాల్లో 2,923 ఎకరాల్లో రీ సర్వేను చేపట్టారు. ఇందులో పోలవరం మండలం సరిపల్లికుంట 64.99 ఎకరాలు, నిడమర్రు మండలం పెదరామచంద్రాపురంలో 135, చింతలపూడి మండలం ఆముదాల చిలకలో 274, పెదపాడు మండలంలో అమృత లింగంపేట 448.72 ఎకరాల్లో ప్రక్రియను పూర్తి చేశారు. మిగిలిన 20 గ్రామాల్లోను తుది దశకు చేరుకుంది. ఈ వారంలోనే భూమికి సంబంధించిన పాస్ పుస్తకాలను సిద్ధం చేయనున్నారు. తొలి విడతలో 120 రోజులు గడువు పెట్టుకోగా, ఈసారి రెండో విడతకు ప్రభుత్వం 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. మొత్తం 30 గ్రామాల్లో 36,539.68 ఎకరాల భూమిని ఈ సర్వే పరిధిలోకి తీసుకుని సర్వే చేస్తున్నారు. రెండో దశలోనూ తొలుత ప్రతి మండలంలో రెండు గ్రామాల్లో సర్వే చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆ తర్వాత ఒక గ్రామానికే పరిమితం చేశారు.

ఖర్చుకు వెనుకాడకుండా...

సర్వే రోవర్లను 126 బ్లాకుల్లో ఉదయం రెండు గ్రామాలు, మధ్యాహ్నం రెండు గ్రామాలకు పంపి ఈ సర్వేను చేస్తున్నారు. మొదటి విడతలో గ్రామానికి రూ.10 వేల చొప్పున రీ సర్వేకు ఖర్చులకు విలేజ్ సర్వేయర్లకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. తాజాగా జరిగే రెండో విడతకు రూ. 8లక్షల వరకు నిధులు విడుదలకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. ఖర్చుకు వెనుకాడకుండా రైతులకు ఉచితంగా వారి సమక్షంలోనే సర్వేలు చేస్తున్నారు.

పారదర్శకంగా సర్వే చేస్తున్నాం..

జేసీ ధాత్రిరెడ్డి పర్యవేక్షణలో టీమ్ వర్కు చేస్తున్నాం. రెండో విడతలో భూముల రీ సర్వేపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయిస్తాం. ఎలాంటి తప్పిదాలు జరగకుండా పారదర్శంగా సర్వే జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- అన్సారీ,ల్యాండ్ సర్వేశాఖ ఏడీ

సర్వేకు ముందుగానే సమాచారం..



నేను 3 ఎకరాల 7 సెంట్లు స్థలం గ్రామంలో కొనుగోలు చేశాను. దీనికి సంబంధించి రీ సర్వేకు ముందుగానే గ్రామ సభ పెట్టి వివరాలను అధికారులు చెప్పారు. తర్వాత క్షేత్రస్థాయిలో రోవర్ సాయంతో కొలిచి లెక్కలు తీశారు. సవ్యంగానే చేశారు. 3 ఎకరాల 4 సెంట్ల స్థలంకు నాకు పాస్‌బుక్ ఇస్తామన్నారు.

- కానూరి శ్రీరామమూర్తి, రైతు, పెదరామచంద్రాపురం

కొత్త దుకాణం.. పాత సరుకు!



వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జారీ చేస్తారనుకున్న స్మార్ట్ రేషన్ కార్డులు ఇప్పటికి లేనట్లే. పక్కాగా రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయన్నది వాయిదానే. గత ఆరు నెలల మాదిరిగానే ఈసారి బియ్యం, పంచదార మినహా కొత్తగా కందిపప్పు, ఇతర సరుకులు రానట్లే. కార్డుల్లో తీసివేతలు, కూడికలు సాగుతున్న తరుణంలో ఇప్పటికిప్పుడు కొత్త రేషన్‌కార్డుల జారీలో సర్కారు ఆచితూచి చేస్తోంది.

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రేపటి నుంచే రేషన్ దుకాణాలు ప్రారంభం

- అట్టహాసంగా ఏర్పాట్లు చేయాల్సిందిగా డీలర్లకు సంకేతాలు
- ప్రస్తుతానికి స్మార్ట్‌కార్డుల జారీలో తీవ్ర జాప్యం
- బియ్యం, పంచదార మినహా కొత్త సరుకులు లేనట్లే

	ఏలూరు జిల్లా	పశ్చిమ గోదావరి
రేషన్ కార్డులు	- 6,20,146	- 5,58,019
రేషన్ షాపులు	- 1,123	- 1,052
గతంలో వాహనాలు	- 395	- 356

చాన్నాళ్లుగా కొత్త రేషన్‌కార్డుల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. గత నెలలో కొత్త రేషన్‌కార్డుల జారీకి సానుకూలంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సంకేతాలు ఇచ్చింది. కార్డుల్లో తొలగింపులు, చేరికలకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. అంతా సంబరపడుతూ సచివాలయాల వైపు పరుగులు తీశారు. తొలగింపులే కాదు ఉన్న రేషన్ కార్డుల్లోంచి తొలగించి తమ పేరిట కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ లోపే వివాహ నమోదు పత్రం ఉండాలని ప్రచారం సాగి రచ్చకు దారి తీసింది. పౌర సరఫరాల విభాగం అంటువంటిదేమీ లేదని తాజాగా స్పష్టం చేసింది.

జగన్ జమానాలో కొంతమంది పేర్లు చేర్చడం, తొలగించడం వంటి చర్యలు తీసుకున్నా ఆకస్మికంగా పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్ ప్రక్రియను నిలిపివేసింది. అప్పట్లో వలంటీర్ల దయా దాక్షిణ్యాల మీదే కొత్త కార్డుల జారీ, పేర్లు తొలగింపు వంటివి చోటు చేసుకున్నాయి. దీనికి తోడు ప్రింటెడ్ రేషన్ కార్డులో కుటుంబంలోని పూర్తి పేర్లు, వ్యక్తులు పేర్లు కొన్నింటిలో లేకపోవడం, కేవలం ఆన్‌లైన్‌కే పరిమితం కావడంతో వివిధ సర్టిఫికెట్ల జారీలో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ మధ్యకాలంలో కుటుంబాల్లో కొత్తగా పెళ్లి అయిన వారితో పాటు మిగతా వారు తాము విడిపోతా మని కొత్తగా రేషన్‌కార్డు ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ తిరిగారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులతో సహా జగన్ బొమ్మతో వున్న కార్డును తొలగించి ఆ స్థానంలో స్మార్ట్‌కార్డు జారీకి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇదంతా ఈ నెలాఖరు నాటికే పూర్తి చేసి జూన్ నుంచి జారీ ప్రారంభిస్తామని ప్రకటించారు. అయితే కొత్త రేషన్‌కార్డుల కోసం ఒక్కొక్క జిల్లాలో 3 వేల కేటుంబాలకు తక్కువగా కాకుండా అభ్యర్థనలు సమర్పించారు. ఏలూరు జిల్లాలోనే 3,265 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈక్రమంలో అందరూ ఊహిస్తున్నట్లుగా జూన్ ఒకటి నుంచే స్మార్ట్ కార్డులు జారీ అయ్యే అవకాశాలు లేవు. దీనికి తోడు కార్డుల్లో పేర్లు తొలగింపు, చేరికలకు తుది గడువు అంటూ ఏది లేదని, ఇదంతా నిరంతర ప్రక్రియ అని సవరణ ప్రకటన చేశారు.

రేపటి నుంచి రేషన్ దుకాణాలు

రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాలు రేపటి నుంచి తిరిగి తెరుచుకునేలా అన్ని ఏర్పాట్లు చేసింది. ఏలూరు జిల్లాలో 1,123 (మిగతా 6వ పేజీలో)

152 కేసులు నమోదు..రూ.ఐదు లక్షల ఫైన్



కలపర్రు టోల్‌గేటు వద్ద ప్రైవేటు బస్సులను తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ఏలూరు క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు జిల్లాలోని రవాణాశాఖ అధికారులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు కాంట్రాక్టు క్యారేజీ బస్సులను కలపర్రు టోల్‌గేటు వద్ద తనిఖీలు చేశారు. విశాఖ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖ మధ్య తిరిగే కాంట్రాక్టు క్యారేజీ బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేసి పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన బస్సులపై కేసులు నమోదు చేశారు. మొత్తం 152 కేసులు నమోదు చేసి రూ.ఐదు లక్షల పదిహేను వందలు అపరాధ రుసుము విధించారు. ఈ తనిఖీల్లో ఏలూరు,జంగారెడ్డిగూడెం ఆర్టీవోలు కేఎస్ఎంఎస్ కృష్ణారావు, ఎండీ మదాని, వాహన తనిఖీ అధికారులు ఎస్.రంగనాయకులు, జి. ప్రసాదరావు, కె.స్వామి, సురేష్‌బాబు, కల్యాణి, కృష్ణవేణి, నరేంద్రబాబు, అన్నపూర్ణ, ప్రజ్ఞులు పాల్గొన్నారు.

1800-11-6666

క్షయ వ్యాధిగ్రస్తుల కోసం టోల్ ఫ్రీ నంబరు

ఏలూరు అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందజేసేందుకు వారిని నిక్షయ్‌మిత్రగా రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఉద్దేశించిన ప్రధాన మంత్రి టి.బి. ముక్త్‌భారత్ అభియాన్ ప్రోగ్రాంను జిల్లాలో విజయవంతంగా అమలుచేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం క్షయ నిర్మూలనపై అవగాహనకు ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ క్షయ్ సంపర్క్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబరు 1800-11-6666ను క్షయ వ్యాధిగ్రస్తుల కోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఏర్పాటు చేశాయన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, డీఐవో డాక్టర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొని ఉంది. జిల్లాలో అక్కడక్కడా శుక్రవారం వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా ఏలూరు రూరల్ మండలంలో 37.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 4.3 మి.మీ నమోదైంది. పెదవేగిలో 24.2, దెందులూరులో 18.4, ఏలూరు అర్బన్‌లో 14.2, ద్వారకా తిరుమలలో 10, పోలవరంలో 6.4, నిడమర్రులో 2.4, ఆగిరిపల్లిలో 1.8, పెదపాడులో 1.6, జీలుగుమిల్లిలో 1, ముదినేపల్లి, మండవల్లిలో 0.8, బుట్టాయిగూడెం, భీమడోలులో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

టికెట్ కంటే తినుబండారాలే అధిక రేటు

- సినిమా థియేటర్లలో ప్రేక్షకుడి జేబుకు చిల్లు
- మార్కెట్ ధరకు రెండింతలు వసూలు

■ లోపలి పేజీలో..

ఒకరోజు ముందుగానే..

- నేడు జూన్ నెల పింఛన్ల పంపిణీ
- లబ్ధిదారులు 2,58,804 మంది
- పింఛన్ల మొత్తం రూ.113 కోట్లు

ఏలూరు సిటీ/ ఏలూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే జూన్ నెల పింఛన్‌లను ఈనెల 31వ తేదీనే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలోని 5,253 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు , ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారని, పింఛన్ల పంపిణీ ఉదయం 7:00 గంటల కల్లా ప్రారంభించాలన్నారు. ఏదైనా కారణం చేత తీసుకోని వారికి జూన్ 2న పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 2,58,804 మంది పింఛన్ దారులకు రూ.113.00 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలో 2,967 స్పౌజ్ పెన్షన్లను జూన్ 12న పంపిణీ చేస్తారన్నారు. ఏ ఒక్క పొరపాటు జరగకుండా పింఛన్ల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు.

గండి మర్మమేమిటో!?



నీరులేక వెలవెలబోతున్న నూజివీడు పెద్ద చెరువు

- ఏడు నెలలుగా పూడ్చివేతకు నోచుకోని పెద్దచెరువు గండి
- ఆ చోట కాంక్రీట్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఇప్పటికీ విడుదల కాని నిధులు..
- చెరువులో నీరు నిల్వ లేకుండా చర్యలు..'మట్టి' తరలించేందుకే అంటూ రైతుల ఆరోపణలు

నూజివీడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : యుద్ధ ప్రాతిపదికన పూడ్చాల్సిన గండిని ఏడు నెలలుగా సాగదీస్తున్నారు. నూజివీడు పెద్ద చెరువుకు పడిన గండిని పూడ్చే విషయంలో జరుగుతున్న ఆలస్యం వెనుక అనేక అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఏడు నెలల క్రితం భారీ వర్షాలకు ఈ చెరువుతో పాటు ఇతర జిల్లాల్లోని పలు చెరువులకు గండ్లు పడ్డాయి. యుద్ధ ప్రాతిపదికన గండ్లు పూడ్చమని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించి నిధులు మంజూరు చేసింది. అయితే పెద్ద గండి పూడ్చివేతకు ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. ఈ గండిని పూడ్చడానికి సుమారు రూ.50 లక్షలు అవుతుందని తొలుత అంచనా వేశారు. తర్వాత ఏమైందో ఏమోకానీ గండిపడిన చోట కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టాలంటూ రూ.రెండు కోట్ల యాభై లక్షలతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అయితే ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. ఈ మధ్య పలు మార్లు వర్షాలు పడ్డాయి. చెరువులో నీరు నిలవకుండా గండిపడిన చోట తూములు ఏర్పాటు చేసి బయటకు పంపుతున్నారు. ఈ నీరు ఆయకట్టు పరిధిలోని పొలాల మీదుగా ప్రవహిస్తూ పంటకు పనికి రాకుండా చేయడమే కాక సమీపంలోని జాతీయ రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు బలహీనపడుతోంది. చెరువులో నీరు నిల్వ ఉంటే మట్టి తోలకానికి ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతోనే చెరువులో నీరు నిల్వ ఉండకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ గండి పూడ్చివేత కాంట్రాక్టు పొందడానికి ప్రయత్నిస్తున్న కాంట్రాక్టరు జాప్యాన్ని తనకు ఉపయోగపడేలా అంచనాలను పెంచాలని అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రతిపాదనలు పంపగా జిల్లా అధికారులు అంగీకరించలేదని సమాచారం.



నూజివీడు-తిరువూరు రహదారిపై ప్రవహిస్తున్న పెద్ద చెరువునీరు

క్రాప్ హాలిడే తప్పదా..

వర్షాలు ప్రారంభమయ్యాయి. కాంక్రీట్ వాల్ నిర్మాణం దేవుడెరుగు కనీసం ఈ చెరువులోని మట్టితో గండి పూడ్చి రోలింగ్ చేస్తే చెరువు కట్ట గట్టిపడి చెరువులో నీరు నిల్వ ఉండేది. ఆయకట్టు రైతులకు మేలు జరిగేది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయకట్టు పరిధిలో ఈ సీజన్‌లో క్రాప్ హాలిడే తప్పదన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

రూ.449 కోట్లు



- జిల్లాలో విద్యుత్ బకాయిలు
- అగ్రస్థానం స్థానిక సంస్థలదే
- వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

ఏలూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఏపీఈపీ డీసీఎల్ పరిధిలో రూ.449 కోట్ల వరకు విద్యుత్ బకాయిలు ఉన్నట్లు ఆ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇందులో ఎల్‌టీ (లోటెన్షన్) విద్యుత్ బకాయిలు రూ.313.70 కోట్లు ఉండగా, హెచ్‌టీ (హైటెన్షన్) విద్యుత్ బకాయిలు రూ.136.56 కోట్లు వరకు ఉన్నాయి. బకాయిలు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, అధికంగా విద్యుత్ బకాయిలు ఉన్న సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నట్టు సంస్థ జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు.

- ఎల్‌టీ విద్యుత్ బకాయిల్లో స్థానిక సంస్థలకు సంబంధించి రూ. 288.97 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. 24.72 కోట్లు రావాల్సి ఉంది. స్థానిక సంస్థల విద్యుత్ బకాయిలు పరిశీలిస్తే పంచాయతీల నుంచి రూ.259.88 కోట్లు, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.28.03 కోట్లు, మున్సిపాల్టీల నుంచి రూ.6.88 లక్షలు, ఎన్‌టీఆర్ సుజల పథకం నుంచి రూ.98.96 లక్షల వరకు విద్యుత్ బకాయిలు ఉన్నాయి. పంచాయతీలు, మున్సిపాల్టీలలో ప్రధానంగా వాటర్‌వర్క్స్, వీధి దీపాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. పంచాయతీరాజ్ అండ్ గ్రామీ ణాభివృద్ధి శాఖ నుంచి రూ. 14.23 కోట్లు రెవెన్యూ శాఖ నుంచి రూ. 2.65 కోట్లు, మెడికల్ అండ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ నుంచి రూ.2.46 కోట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేసన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ నుంచి రూ.1.33 కోట్లు వరకు బకాయిలు ఉండగా మిగిలిన ప్రభుత్వ శాఖల నుంచి బకాయిలు ఉన్నాయి.
- జిల్లాలో హెచ్‌టీ విద్యుత్ బకాయిలు రూ.136.56 కోట్లు ఉన్నాయి. ఇందులో ఎత్తిపోతల పథకాలకు, సీపీడబ్ల్యూ పథకాలకు, సత్యసాయి వాటర్ పథకానికి, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి విద్యుత్ బకాయిలు ఎక్కువగానే ఉన్నాయి. ఆర్ డబ్ల్యుఎస్, ఏపీఎస్ఐడీసీ, సీజీ-రైల్వే, ప్రభుత్వ ఆస్పత్రి తదితర శాఖలకు సంబంధించి ఈ బకాయిలు ఉన్నా యని చెబుతున్నారు. 'విద్యుత్ బకాయిలు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే మొండి బకాయిలు ఉన్న సంస్థలకు నోటీసులు జారీ చేశాం. స్థానిక సంస్థల నుంచి బకాయిల వసూలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం' అంటూ జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు.

వచ్చేది వరదాకాలం..!

పునరావాసం ఊసెత్తని అధికారులు

- భయంతో వణుకుతున్న ముంపు మండలాల ప్రజలు
- పూర్తిగా అందని పరిహారం.. గ్రామాలను ఖాళీ చేసేందుకు ససేమిరా



పెదవాగు విధ్వంసానికి ధ్వంసమైన మేడేపల్లి గ్రామంలోని ఇళ్లు (ఫైల్)

వేలేరుపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : ముంపు మండలాల ప్రజలను రానున్న వర్షాకాలం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రుతుపవనాలు వారంరోజుల ముందుగానే ప్రవేశించడం, అల్పపీడనాలు ఏర్పడడం, ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరి ఎగువ ప్రాంతంలో 10 జిల్లాలకు భారీ వర్షాలు వస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు వెరసి.. ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచే గోదావరికి వరద తప్పదన్న భయంలో ముంపు మండలాల ప్రజలు ఉన్నారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో గోదావరికి వచ్చిన వరదలకు ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో తీవ్ర నష్టం జరిగింది. గతేడాది పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం గోదావరి వరదలు మరోవైపు పెదవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో ఊళ్లకు ఊళ్లే ధ్వంసమై పోయాయి. అధికారులు వరదలు వచ్చిన సమయాల్లోనే స్పందిస్తున్నారు తప్ప తాము పడుతున్న బాధలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రయత్నాలు చేయడం లేదని ముంపు ప్రజలు వాపోతున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపునకు గురయ్యే ఈ రెండు మండలాల్లో పునరా వాస ప్యాకేజీ చెల్లించి పునరావాస కాలనీలకు తరలించాల్సి ఉండగా గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల ఖాతాల్లో కొంతమేర పరిహారం సొమ్ములను జనవరి 2న జమ చేశారు. అయితే ఏ ఒక్క గ్రామంలోను పూర్తిస్థాయిలో పరిహారం జమ కాకపోవడం వల్ల ముంపువాసులు గ్రామాలను ఖాళీ చేసేందుకు నిరాకరిస్తుండగా మరోవైపు పునరావాస కాలనీలకు తరలించే సాహసం అధికారులు చేయలేకపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పునరావాస ప్యాకేజీలు నిర్వాసితుల జమ చేసే అవకాశం లేదు.

ముప్పేట దాడి..

ఏటా గోదావరికి వరదలు, పెదవాగుకు వరదలు జూలైలో రావడం పరిపాటి. కాని ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా జూన్ మొదటి వారం నుంచే వరదలకు అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ముంబైలోను, గోదావరి పరీవాహక ప్రాంతమైన తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వీటి కారణంగా గోదావరిలో వరద పెరుగుతోంది. దీనికి తోడు పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ముంపు మండలాలపై ప్రభావం చూపనుంది. అలాగే గతేడాది జూలైలో పెదవాగు ప్రాజెక్టు తెగిపోయింది. నేటి వరకు గండి పూడ్చే ప్రయత్నాలు ఇరురాష్ట్రాలు చేయకపోవడంతో పెదవాగుకు వచ్చే వరదమొత్తం వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలపై విరుచుకుపడే అవకాశం ఉంది. ప్రాజెక్టు కట్టతెగినప్పుడు ప్రాజెక్టు దిగువన ఉన్న 12 గ్రామాల్లో తీవ్ర విధ్వంసం జరిగింది. దాని ప్రభావం నుంచి ఇప్పటికి ఆగ్రామాల ప్రజలు తేరుకోలేదు.

యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం

ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్రే లక్ష్యం : కలెక్టర్

ఏలూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా మే 21న ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర జిల్లాలో దిగ్విజయంగా సాగుతోంది. ప్రణాళిక ప్రకారం జిల్లాలో దాదాపు ఎనిమిది లక్షల మందికి యోగాను చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఇప్పటికే 4.18 లక్షల మంది తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. యోగాభ్యాసకులకు శిక్షణ అందించేందుకు 6,226 మంది శిక్షకులు నమోదై ఉన్నారు. మండల స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కనీసం 50 మందికి యోగాను చేరువ చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 వరకు జిల్లాలోని ప్రతి గ్రామ, పట్టణాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించను న్నారు.

యోగాంధ్రలో డ్వామా సిబ్బంది

వట్లూరు టీటీడీసీలో శుక్రవారం నిర్వహించిన యోగాభ్యాస కార్యక్రమంలో డ్వామాకు చెందిన పలువురు సిబ్బంది పాల్గొన్నట్టు పీడీ కేవీ సుబ్బారావు తెలిపారు.



ఆర్టీసీ కార్గోలో మండల కేంద్రాలకు తరలిస్తున్న పుస్తకాలు

కొత్త పుస్తకాలు సిద్ధం

- మండల కేంద్రాలకు చేరవేత
- పాఠశాలలు తెరిచే నాటికి పంపిణీ



తాడేపల్లిగూడెం రూరల్, మే30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు జిల్లా పుస్తక విక్రయ కేంద్రం నుంచి మండలాలకు చేరుకున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 12,44,864 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా పది రోజుల క్రితమే జిల్లా పుస్తక విక్రయ కేంద్రం నుంచి ఆయా మండల కేంద్రాలకు తరలించారు.

బ్యాగ్ బరువు తగ్గించేలా..


ప్రస్తుతం సెమిస్టర్ పద్ధతిలో సిలబస్ విభజించి పుస్తకాలు రెండు దఫాలుగా అందించే ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గనుంది. పాత సిలబస్ మార్పు చేయకుండా కొత్త పుస్తకాలు రూపొందించారు. గతంలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్ట్‌లపై జగన్ ఫోటోలు ముద్రించడంతో సర్వత్రా విమర్శలు వచ్చాయి. కూటమి సర్కారు ఫోటోలకు ప్రాధాన్యం ఇవ్వకుండా బ్యాగ్‌లు, బెల్ట్‌లు, పుస్తకాలు సిద్ధం చేశారు. 53 టైటిల్స్ తగ్గించేవిధంగా పుస్తకాల్లో మార్పు చేశారు. 1 నుంచి 7వ తరగతి వరకూ గతంలో 223 టైటిల్స్ ఉండగా ప్రస్తుతం 170కి కుదించారు. వాటిని కూడా రెండు సెమిస్టర్లుగా విభజించారు.

కిట్‌లో బెల్ట్‌లు మాత్రమే..

విద్యార్థులకు అందించే స్కూల్ కిట్‌లో నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూ ఇంకా రాలేదు. ప్రస్తుతం బెల్ట్‌లు మాత్రమే వచ్చాయి. వారం రోజుల్లో బ్యాగ్‌లు, షూ, నోట్ పుస్తకాలు మండల కేంద్రాలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 93450 మంది విద్యార్థులు ఉండగా 1 నుంచి 5 వ తరగతి వరకు బాలికలకు మాత్రమే బెల్ట్‌లు అందిస్తారు. ఆ బెల్ట్‌పై సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర అని ముద్రించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యారంగానికి చేసిన సేవలను గుర్తింపుగా లోగో వేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వాటితోపాటు నోట్ పుస్తకాలపై కూడా రాష్ట్రం అధికారిక ముద్ర మినహా మరే ఫోటోలకు తావివ్వలేదు. మొత్తం విద్యార్థి కిట్ అంతా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర అని ఉండటం గమనార్హం.

యూనిఫాం అందలేదు..

జిల్లాలో 93,450 మంది విద్యార్థులకు యూనిఫాం ఇంకా జిల్లా కేంద్రాలకు చేరలేదు. క్లాత్ మండల కేంద్రాలకు చేరితే కుట్టించేందుకు మరింత సమయం పడుతుంది. క్లాత్ చేరుకోకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



స్టైల్, ఫ్యాషన్, రిలాక్సేషన్.. ఏ పేరుతో మొదలెట్టినా వ్యసనంగా మారి ప్రాణాలను హరిస్తాయి పొగాకు, దాని అనుబంధ ఉత్పత్తులు. పొగాకు నమలడం, పొగ పీల్చడం వల్ల అన్ని శరీర భాగాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఊపిరితిత్తులు, ఎముకల సామర్థ్యం క్షీణిస్తుంది. పొగాకు వాడకం వల్ల కలిగే ప్రమాదాన్ని తెలిపేందుకు ఏటా మే 31న ప్రపంచ పొగాకు నిరోధక దినం పాటిస్తారు.

పొగాకు ప్రాణాంతకం



నేడు పొగాకు వ్యతిరేక దినం

- పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ధూమపానం అధికం
- ఖైనీ, గుట్కా క్యాన్సర్ కారకం
- శ్వాసకోశ వ్యాధుల ముప్పు

ద్వారకాతిరుమల, పోలవరం, నిడమర్రు, మే 30 (ఆంధ్రజ్యోతి): పొగాకు, అనుబంధ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యానికి తీవ్ర ముప్పు. నేరుగా పొగాకు నమలడం, ఖైనీ, పాన్ మసాలా, జర్దా పాన్ వంటి వాటితో వ్యాధులను కొనితెచ్చుకోవడమే. ప్రధానంగా ధూమపానం శరీరంలో అన్ని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఊపిరితిత్తులు గుల్ల అవుతాయి. పొగాకులో 600కంటే ఎక్కువ రసాయనాలున్నాయి. ఆర్సెనిక్, బెంజీన్, బెరీలియం, కాడ్మియం, క్రోమియం వంటి 72 రసాయనాలు కచ్చితంగా కేన్సర్ కారకాలు. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. శ్వాసకోశ వ్యాధుల తీవ్రతను పెంచుతుంది.

ఏ రూపంలో తీసుకున్నా నష్టమే

పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టమే. శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఊపిరితిత్తులకు మరింత ప్రమాదకరం. మెదడులో రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. పొగాకు వినియోగంతో క్షయ వ్యాధి, కంటి సమస్యలు, క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులే కాకుండా స్వరపేటిక, నోరు, అన్నవాహిక, గొంతు, మూత్రాశయం, మూత్రపిండాలు, కాలేయం, కడుపు, క్లోమం, పెద్దప్రేవు, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.

2025 థీమ్ ఇదీ..

ఏటా ప్రపంచ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వివిధ అంశాలపై చర్చలు చేపడతారు. ఈ ఏడాది పొగాకు, నికోటిన్ ఉత్పత్తులపై పరిశ్రమ వ్యూహాలను బహిర్గతం చేయడం ప్రధాన అంశం. పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల వైపు యువతను ఆకర్షించే మోసపూరిత మార్కెటింగ్, మోసపూరిత వ్యూహాలను బహిర్గతం చేయడం ఈ ఏడాది లక్ష్యం.



పాసివ్ స్మోక్ ప్రమాదమే..

పొగ తాగేవారి పక్కనున్న వారికి కూడా ప్రమాదమే. వారు వదిలిన పొగ గాలిలో చేరడంతో పక్కవారు పీల్చుతారు. దీనినే పాసివ్ స్మోకింగ్ అంటారు. ధూమపానం చేసేవారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు, చుట్టుపక్కల వారికి సైతం హాని తప్పదు. శ్వాస, గుండె, గర్భధారణ, ఆర్థరైటిస్ సమస్యలు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీస్తుంది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.

ఎముకల ఆరోగ్యంపై ప్రభావం



ధూమపానం అన్ని శరీర భాగాలతో పాటు ఎముకల ఆరోగ్యంపై హానికర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎముక ద్రవ్యరాశిని తగ్గించడంతో పాటు ఆస్టియోపోరోసిస్ అనే ఎముకల వ్యాధికి దారితీస్తుంది. తుంటి, వెన్నుముకకు పగుళ్లు ఏర్పడతాయి. ధూమపానం చేసే స్త్రీలలో ఆస్టియోపోరోసిస్ వ్యాధిని మరింత పెంచుతుంది. ఎముకలు విరిగి శస్త్రచికిత్స చేయించుకున్న వారిలో ధూమపానం వల్ల ఎముక అతుక్కోని కేసులు ఇటీవల ఎక్కువయ్యాయి. ధూమపానం అలవాటు మానుకుంటే వ్యాధులను దూరం చేయవచ్చు



ధూమపానం రక్త సరఫరాను తగ్గిస్తుంది

ధూమపానం ఎముకలకు, ఇతర శరీర కణజాలాలకు రక్తసరఫరాను తగ్గిస్తుంది. ఆస్టియోబ్లాస్ట్‌లు అని పిలిచే ఎముకలను ఉత్పత్తిచేసే కణాలను నికోటిన్ వంటి పదార్థం తగ్గిస్తుంది. కాల్షియం శోషణను తగ్గిస్తుంది. ధూమపానం స్త్రీలు, పురుషుల్లో బలమైన అస్థిపంజరాన్ని నిర్మించడానికి, నిర్వహించడానికి వినియోగించే ఈస్ట్రోజన్‌తో సహా వివిధ హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.

\- డాక్టర్ భవ్యచంద్, ఆర్థోపెడిక్ సర్జన్, విర్స్, ద్వారకాతిరుమల

అంతర్గత వ్యవస్థలపై తీవ్ర ప్రభావం

పొగాకు ఉత్పత్తుల వాడకం అంతర్గత అవయవ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపెడుతుంది. గుండె నరాలలో బ్లాక్స్‌తో గుండెపోటు అవకాశం ఎక్కువ. ఊపిరితిత్తులపై కూడా తీవ్ర ప్రభావంతో బ్రోమైకైటిస్, దగ్గు, కేన్సర్ సంభవించవచ్చు. జీర్ణాశయం, మూత్రపిండాలు, ఎముకల పటుత్వం, పెద్ద ప్రేవు, కంటి చూపుపై ప్రభావం పడుతుంది. ధూమపానం మానుకోవడం ద్వారా మనిషి ఆరోగ్యవంతులవుతారు.

\- డాక్టర్ దాట్ల కృష్ణంరాజు, గణపవరం





అలహాబాద్ హైకోర్టు పూర్వ జడ్జి సుధీర్ నారాయణ్ నుంచి అవార్డు అందుకుంటున్న కంభంపాటి సాంబశివమూర్తి (ఇన్‌సెట్) అవార్డు పత్రం

కంభంపాటి సాంబశివమూర్తికి
సంస్కృత మహా మహోపాధ్యాయ పురస్కారం

ఇరగవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయ ఆచార్య కంభంపాటి సాంబశివమూర్తి సంస్కృత మహా మహోపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అలహాబాద్‌లో జరిగిన హిందీ సాహిత్య సమ్మేళన్‌లో అలహాబాద్ హైకోర్టు పూర్వ జడ్జి సుధీర్ నారాయణ్ నుంచి ఈనెల 27న అవార్డును అందుకున్నారు.

కంభంపాటి సాంబశివమూర్తి కృష్ణా జిల్లా ఆగిరిపల్లిలో లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల సంతానంలో ఒకరు. పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన ఆయన చిన్నాన్న కంభంపాటి వెంకట సుబ్రహ్మణ్యం, వెంకట సూర్యకాంతమ్మ దంపతులు దత్తత తీసుకున్నారు. బాల్యంలోనే దత్త తండ్రి వద్ద స్మార్త ప్రక్రియలను అభ్యసించి పరీక్షలలో ఉత్తమ సంస్థానం పొందారు. రేలంగిలో పదో తరగతి వరకు అభ్యసించిన తరువాత తూర్పుగోదావరి జిల్లా పొడగట్లపల్లిలో సాహిత్య విద్యా ప్రవీణ పూర్తి చేసుకుని తిరుపతి కేంద్రీయ సంస్కృత విద్యాపీఠంలో శిక్షా శాస్త్రి, సంస్కృత సాహిత్యం, సంస్కృత శిక్షా శాస్త్రంలో విద్యా వారది ఉపాధులను పొందారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో టీజీటీ, పీజీటీ సంస్కృతంగా అధ్యాపక వృత్తి చేపట్టి తర్వాత రాష్ట్రీయ సంస్కృత స్థానం, న్యూఢిల్లీ ఆధీనంలోని కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం, ఒడిశాలో వ్యాఖ్యాతగా, రామానందాచార్య రాజస్థాన సంస్కృత విశ్వవిద్యాలయంలో శిక్షా విభాగంగా అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. రేలంగిలో ప్రసిద్ధ పంచాంగకర్త తంగిరాల వెంకటకృష్ణ సోమయాజులు (రేలంగి హైస్కూల్ అప్పటి ప్రధానోపాధ్యాయులు) పెద్ద కుమార్తె వల్లీ మహాలక్ష్మితో ఆయన వివాహమైంది.

వైదిక శిరోమణి, శిక్షా విశారద, సంస్కృత శిక్షా భారతి, సంస్కృత శిక్షకరత్నం తదితర బిరుదలతో సత్కారం పొందారు. ప్రస్తుతం రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో పరీక్షా నియంత్రకులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 5000 మంది విద్యార్థులకు సంస్కృత భాషా, శిక్షణాకార్యాలను నిర్వహించి అత్యుత్తమ ఆచార్యునిగా గుర్తింపు పొందారు. దక్షిణ భారత దేశంలో మొట్టమొదటి రేలంగి గ్రామానికి చెందిన ఆచార్య కంభంపాటి సాంబశివమూర్తి అవార్డును అందుకోవడం గర్వకారణమని పలువురు అభినందించారు.

40 ఏళ్ల సేవలకు గుర్తింపు



సంస్కృత భాషా సాహిత్యాల ప్రచార ప్రసారాలకు 40 ఏళ్లుగా చేసిన సేవలకు గుర్తింపుగా సంస్కృత మహా మహోపాధ్యాయ అవార్డుతో సత్కరించారని కంభంపాటి సాంబశివమూర్తి తెలిపారు. తెలుగులో 20 గ్రంథాలు రాసినట్లు చెప్పారు. సంస్కృత సాహిత్యంలో పరిశోధన, 100 రీసెర్చ్ స్కాలర్స్‌కు మార్గదర్శకునిగా సేవలందించి నట్లు ఆయన వివరించారు.



ఆటపాక పక్షుల కేంద్రంలో నీరు లేక ఎండిపోయిన చెరువు

కొల్లేరు
అతిథులకు అవస్థలు
అభివృద్ధికి నోచుకోని పక్షుల కేంద్రం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు అతిథులైన వలస పక్షులకు అవస్థలు తప్పడం లేదు. పర్యాటకంగా ఎంతో ఆకట్టుకుంటున్నప్పటికీ సరైన వసతులు లేకపోవడంతో పర్యావరణ ప్రేమికులను నిరుత్సాహానికి గురిచేస్తోంది. ప్రభుత్వాలు కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటిపై దృష్టి పెట్టడం లేదు. వేసవిలో నీరు ఎండిపోవడంతో పక్షులు అల్లాడుతున్నాయి. ఆహారం కూడా అందని పరిస్థితిలో ఇతర ప్రాంతాలకు వలస పోతున్నాయి.

- నీరు లేక ఎండిన చెరువు
- అల్లాడుతున్న వలస పక్షులు
- ఆహారం దొరక్క వేరొక చోటికి వలస
- కొల్లేరులో వసతుల కొరత
- పర్యాటకులకు తప్పని పాట్లు



ఖాళీగా ఉన్న ఐరన్ స్టాండ్‌లు

కైకలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సు 77,138 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కేవలం 310 ఎకరాల చెరువులో మాత్రమే వలస పక్షుల ఆవాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. కొల్లేరుకు వరద వస్తే ఈ చెరువు సరస్సులో కలిసిపోతుంది. వేసవిలో నీరు లేక ఎండిపోతుంది. పక్షులకు ఆహారం కూడా దొరకని పరిస్థితుల్లో కొల్లేరు నుంచి తిరిగి సుదూర ప్రాంతాలకు వలస పోతున్నాయి. కొల్లేరు సరస్సు పక్షులకు స్వర్గధామం. ఇక్కడి వాతావరణం వాటికి ఎంతో అనుకూలం, సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. ఇలాంటి వలస పక్షుల కోసం ఏర్పాటుచేసిన కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం చెరువు. ఈ చెరువుకు చుట్టూ కొల్లేరు సరస్సు సరస్సులోని పోల్‌రాజ్ డ్రెయిన్‌తో చెరువులో నీరు నిల్వ ఉండక వేసవిలో పూర్తిగా అడుగంటిపోతుంది. చెరువు గట్టును బలోపేతం చేయకపోవడంతో నీరు లేక వెలవెలబోతుంది. ఏటా వరదల సమయంలో ఉన్న కొద్దిపాటి గట్లు మునిగిపోతాయి. వేసవిలో నీరు ఇంకిపోవడంతో బోటు షికారును అధికారులు నిలిపివేస్తారు. వేసవి సెలవుల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు నిరుత్సాహానికి గురవుతున్నారు. అంతేగాక చెరువులో విలువైన మత్స్య సంపద మృత్యువాత పడుతుంది. మత్స్య సంపద ఆహారమైన పక్షులు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నాయి. ఏటా ఈ పరిస్థితి పునరావృతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

పక్షుల కేంద్రం చెరువు నీటి నిల్వలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాకపోవడంతో ఈ సంవత్సరం తవ్వకాలు చేపట్టలేం. త్వరలో వీటిపై అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడమే గాక వర్షాలు ముందుగా వస్తున్నందున త్వరితగతిన చెరువు నింపి బోటు షికారు చేసేలా చర్యలు తీసుకుంటాం.

రామలింగాచార్యులు, అటవీశాఖ రేంజర్

చేపల పరిశ్రమ అభివృద్ధికి కృషి

కొల్లేరు కేంద్రంగా చేపల పరిశ్రమ మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తామని మత్స్య శాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్ అన్నారు. కొల్లేరు ప్రాంతాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పెద్ద ఎడ్లగాడి వద్ద, ఆటపాక పక్షుల కేంద్రం వద్ద కొల్లేరు సరస్సును పరిశీలించి వివరాలను సేకరించారు. కొల్లేరు సరస్సులో 46 మత్స్య శాఖ సొసైటీల వివరాలు తెలుసుకున్నారు. గత ఆరేళ్ల క్రితం కొల్లేరును పరిశీలించానని అప్పటికి ఇప్పటికి మత్స్య ఉత్పత్తుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సరస్సులో వలస పక్షులు, స్థానికంగా ఉన్న పక్షుల వివరాలను తెలుసుకున్నారు. మేజర్, మైనర్ డ్రెయిన్లు, పంట కాల్వల నుంచి సరస్సులో నీరు వచ్చే విధానం తెలుసుకున్నారు. ఎన్ని కాలువల ద్వారా ప్రతీ సంవత్సరం కొల్లేరులోకి నీరు వస్తుందో అనే అంశాలను తెలుసుకున్నారు.



యోగేశ్వరి
యోగాసనాల్లో దిట్ట

నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పెట్టిన పేరుకు ఆ చిన్నారి సార్థకత తెచ్చింది మూడేళ్ల యోగేశ్వరి. నూజివీడుకు చెందిన రెడ్డి సతీష్, సాయి ప్రసన్నల కుమార్తె యోగేశ్వరి అనుజ్ఞశ్రీ. తాత యోగసనాలను చూస్తూ సరదాగా అనుకరించేది. చిన్నారి ఆసక్తిని గమనించిన ఆమె తల్లి సాయి ప్రసన్న శిక్షణ ఇవ్వడంతో యోగేశ్వరి సులువుగా ఆసనాలు వేసేది. ద్వారకాతిరుమలలో యోగాంధ్ర కార్యక్రమంలో తల్లితో పాటు యోగేశ్వరి సభాస్థలిపై ప్రదర్శించిన యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారి ప్రదర్శనను చూసి కలెక్టర్ వెట్రి సెల్వి అబ్బురపడ్డారు.



తల్లితో కలిసి సాధన చేస్తున్న యోగేశ్వరి



గిడ్డంగిలో వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు

మాయా బజార్
గుట్టలుగా ద్విచక్ర వాహనాల విడి భాగాలు

- యథేచ్ఛగా బహిరంగ విక్రయాలు
- ఏటా రూ. లక్షల్లో వ్యాపారం
- అక్కడ ఎవరికీ అనుమతి ఉండదు
- అర క్షణంలో అడిగిన పరికరాలు
- సామాన్యులకు అందుబాటు ధరలో..
- కొరవడిన అధికారుల నిఘా

అదొక మాయా బజార్.. పెనుగొండ, సమీప గ్రామాల్లో ద్విచక్ర వాహన విడి భాగాల దుకాణాలు నిర్విరామంగా వ్యాపారం సాగిస్తాయి. దుకాణంలోకి ఎవరికీ ప్రవేశం ఉండదు. ఎవరికైనా ఏ విడి భాగం కావాలని అడిగినా క్షణాల్లో చేతిలో పెడతారు. లోపల చూస్తే పాత ఇనుప సామగ్రిని తలపిస్తాయి. ఏదో మేజిక్ లేదా మాయ చేసినట్లు కొద్ది నిమిషాల్లో ద్విచక్ర వాహనం సిద్ధమవుతుంది. ఎవరు ఎక్కడి నుంచి ఏ వాహనం తెస్తారో తెలియదు. వందల వాహనాలు అక్కడ పడి ఉంటాయి. పక్కనే వందలు, వేల విడి భాగాల గుట్టలు ఉంటాయి. అందుబాటు ధరలో వాహన విడి భాగాలు లభ్యమవుతాయి. స్థానికంగా విక్రయాలే కాదు పెద్ద వాహనాల్లో ఇతర ప్రాంతాలకు కూడా తరలిస్తారు.

పెనుగొండ, మే 30(ఆంధ్రజ్యోతి): పెనుగొండ, పరిసర రెండు గ్రామాల్లో ద్విచక్ర వాహన విడిబాగాల వ్యాపారం అందరిని విస్తుబోయేలా చేస్తుంది. వివిధ ప్రాంతాల నుంచి వాహనాలను ఇక్కడకు తీసుకొచ్చి క్షణాల్లో ఎవరూ గుర్తుపట్టనివిధంగా విడి భాగాలు వేరు చేస్తారు. వాటిని స్థానికంగా కావలసిన వారికి విక్రయిస్తారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి కూడా చేస్తారు. కొనుగోలు, అమ్మకాలతో ఏటా లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుందని ఒక అంచనా. నిఘా యంత్రాంగం ఇక్కడి కార్యకలాపాలపై దృష్టి సారించకపోవడం వెనుక పెద్ద ఎత్తున సొమ్ములు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

భారీ ఎత్తున సాగే వ్యాపార ప్రాంగణంలోకి అందరిని అనుమతించరు. ఏ విడి భాగం కావాలో చెబితే వారే క్షణంలో తెచ్చి చేతిలో పెడతారు. టైర్లు, రిమ్‌లు, సైలెన్సర్లు, ఇంజన్లు, ఏ చిన్న విడి భాగమైనా ఇక్కడ లభిస్తుందని పలువురు చెబుతారు. మెకానిక్‌లకు సైతం భలే ఆదాయం. ఇక్కడ తళతళలాడే ద్విచక్ర వాహనాలు సైతం అమ్మకానికి ఉండడం గమనార్హం.

పేదోడి షోరూమ్!

పెనుగొండలో ద్విచక్ర వాహనాల విడిబాగాల వ్యాపారం కొందరు మాయా బజార్ అంటే మరికొందరు పేదోడి షోరూమ్ అంటారు. ద్విచక్ర వాహనదారు తన వాహనానికి సంబంధించిన విడిబాగాలు షోరూమ్‌లలో వేల రూపాయలు ఉంటే ఇక్కడ కావలసిన విడి భాగాన్ని తక్కువ ధరకే పొందుతాడు. దీంతో అనేక మంది వాహనదారులు తనకు కావాల్సిన విడిభాగాలకు ఇక్కడకు వచ్చి కావలసిన వాటిని తీసుకుని వెళుతుంటారు. దీంతో షోరూమ్ కంటే ఇక్కడే విడిభాగాలు కొనే వారితో సందడిగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ వ్యాపారం ఎలాంటిదో గానీ పేదోడి షోరూమ్ అంటుంటారు.



గుట్టలుగా పోసిన ద్విచక్ర వాహన విడి భాగాలు

దిగుమతి.. ఎగుమతి..!

ఆటోలు, లారీల్లో వివిధ ప్రాంతాల నుంచి పాత వాహనాలు ఇక్కడి తీసుకు వస్తున్నట్లు పలువురు చెబుతారు. నిత్యం సిద్ధంగా ఉండే సుమారు పది మంది కార్మికులు తెచ్చిన వాహనాలను క్షణాల్లో విడిభాగాలుగా మార్చేస్తారు. ఉభయ గోదావరి జిల్లాల్లో మరెక్కడా లేని విధంగా పెనుగొండతో పాటు సమీపంలోని రామన్నపాలెం, వడలి గ్రామాల్లో కూడా ఈ తరహా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు పది దుకాణాల్లో అమ్మకాలు చేస్తుండగా మిగిలిన వాహనాలు, విడి భాగాలను రెండు రోజులకోసారి లారీల్లో గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం ఇతర పట్టణాలకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

'థింక్ ఇండియా'తో 'ఏపీ నిట్' ఒప్పందం

తాడేపల్లిగూడెం అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి) : బెంగళూరుకు చెందిన థింక్ ఇండియాతో ఏపీ నిట్‌కు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు థింక్ ఇండియా ఏపీ రాష్ట్ర కన్వీనర్ బి.చంద్రశేఖర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ భారతదేశంలోనే ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐఎస్సీ, ఐఐఎం, నింహాన్స్, ఎన్‌ఎల్ఎస్ఐయూ వంటి విద్యా సంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు థింక్ ఇండియా సంస్థను 2006లో ప్రారంభించారన్నారు. వారి సూచనలు, సలహాలు నిట్ విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. ఒకరి ఆలోచనలను మరొకరు పంచుకోవడంతో పాటూ ఇంటర్న్‌షిప్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ రవికిరణ్‌శాస్త్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర‌రెడ్డి, థింక్ ఇండియా సంస్థ కో కన్వీనర్ ప్రణవ్ పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో పోస్టులకు దరఖాస్తుదారుల ప్రొవిజినల్ జాబితా విడుదల

▸ అభ్యంతరాలుంటే జూన్ 6 వరకు ఫిర్యాదు చేయొచ్చు

ఏలూరు క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రుల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజినల్ జాబితా వెబ్‌సైట్ నందు విడుదల చేశామని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, ఆంధ్రప్రదేశ్, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, ఏలూరు జిల్లా ఉత్తర్వుల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రులకు సంబంధించి 31 పోస్టులకు గాను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఒక ఏడాది కాలానికి భర్తీ చేయుటకు విడుల చేసిన నోటిఫికేషన్‌లో తెలుపబడిన పోస్టులకు అభ్యర్థుల నుంచి ఏప్రిల్ 9 నుంచి ఏప్రిల్ 19 వరకు అభ్యర్థుల నుంచి స్వీకరించారు. దరఖాస్తుల పరిశీలన తరువాత https/eluru.ap.gov.in and https://westgodavari.ap.gov.in అను వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాలో పొందుపరిచామన్నారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉన్నచో జూన్ రెండు నుంచి ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు తగిన ఆధారాలతో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ క్యాంపస్, ఏలూరు ఆవరణలో గల జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వారి కార్యాలయం నందు స్వయంగా సమర్పించాలన్నారు. అనతరం అభ్యర్థుల తుది మెరిట్ జాబితా, అనర్హత పొందిన అభ్యర్థుల జాబితాలు వెబ్‌సైట్‌లో ఉంచబడతాయన్నారు. అభ్యర్థుల నియామకపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా మెరిట్, రోస్టర్ విధానం ద్వారా మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు.

నేడు '20 సూత్రాల' అమలు చైర్మన్ పర్యటన

ఏలూరుటూటౌన్, మే30 (ఆంధ్రజ్యోతి): 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకరణ్ ఈనెల 31న ఏలూరు వస్తున్నారు. ఉదయం ఏలూరు రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పాత్రికేయుల సమావేశం సమావేశంలో పాల్గొంటారు. భోజనం అనంతరం నాలుగు నుంచి ఐదు గంటల వరకు కూటమి నాయకులతో సమావేశమవుతారు. అనంతరం విజయవాడ బయలుదేరి వెళతారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ నూజివీడు రూరల్ పోలీసులను ప్రేమ జంట ఆశ్రయించింది. నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చల్ల రోహిత్ తెలంగాణ రాష్ట్రం కోషాయిగూడకు చెందిన నయనరపు నవ్యశ్రీ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని వారు తమ పెద్దలకు తెలియజేయగా వారు పెళ్ళికి నిరాకరించడంతో ప్రేమికులిద్దరూ ఏలూరు నవ సమాజ్ సొసైటీలో శుక్రవారం వివాహం చేసుకున్నారు. అనంతరం పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ నూజివీడు రూరల్ పోలీసులను ఆశ్రయించారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

ముదినేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి):గుడివాడ, భీమవరం జాతీయ రహదారిలో ముదినేపల్లి మండలం దాకరం గ్రామం వద్ద ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొన్న ఘటనలో ఒక యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. పోలీసుల వివరాలివి.. ముదినేపల్లి నుంచి మండవల్లి మండలం గన్నవరం బైక్‌పై వెళ్తున్న కాట్రు అనిల్ కుమార్ అనే యువకుడిని కైకలూరు వైపు నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు గురువారం రాత్రి ఢీకొంది. ఈ ఘటనలో ఆ యువకుడికి తీవ్ర గాయాలవడంతో అతనిని 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.



పోలసానిపల్లిలో గురుకుల పాఠశాలలో కూలిన ల్యాబ్‌గది స్లాబ్

కూలిన స్కూల్ ల్యాబ్ గది స్లాబ్

▸ గురుకుల పాఠశాలలో తప్పిన పెను ప్రమాదం

భీమడోలు, మే 30 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం పోలసానపల్లి గురుకుల ఇంటర్, డిగ్రీ పాఠశాలలో పెను ప్రమాదం తప్పింది. గురుకుల పాఠశాలకు చెందిన ల్యాబ్ గది స్లాబ్ విరిగిపడింది. కళాశాలకు సెలవు దినాలు కావడంతో విద్యార్థినులందరూ తమ ఇళ్లకు వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ల్యాబ్ గదిలో శుక్ర, శనివారాల్లో ఏపీ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలపై కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి అధికారులు గురువారం సాయంత్రం వరకు ఆ గదిలో అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి ఈ గది స్లాబ్ కూలిపోయింది. కౌన్సిలింగ్‌ను వేరే ప్రదేశంలో ఏర్పాటు చేసుకున్నారు. స్లాబ్ వెనుకవైపు వర్షం పడి తరచూ స్లాబ్ పైభాగం తడిచిపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని గురుకుల పాఠశాల అధికారులు తెలిపారు. జరిగిన ఘటనపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.



జంగారెడ్డిగూడెం మునిసిపల్ కార్యాలయం

ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు

జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధికి, ఆదాయానికి ప్రధాన భూమిక పోషించాల్సిన మునిసిపల్ సిబ్బంది కొరతతో పట్టణ ప్రజలకు సేవలు అందడం లేదు. బదిలీలపై, ప్రమోషన్లపై అధికారులు వచ్చినప్పటికీ ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు. వారు వచ్చి వెళ్లిన విషయం కూడా తెలియకముందే బదిలీపై కాని, డిప్యూటేషన్లపై కాని వెళ్లిపోతున్నారు. పన్నుల రూపేణా మున్సిపాలిటీకీ రావలసిన ఆదాయం పూర్తిగా సమయానికి సమకూరడం లేదు. ఈ మేరకు పట్టణంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీని వెంటాడుతున్న సిబ్బంది కొరత

▸ ఏడు నెలలుగా సెలవులో ఉన్న ఏఈ
▸ ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న టీపీవో
▸ సిబ్బంది కొరతతో ప్రజలకు అందాల్సిన సేవలు ఆలస్యం
▸ మునిసిపాలిటీకి రావలసిన ఆదాయానికి గండి
▸ నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు

జంగారెడ్డిగూడెం,మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో జంగారెడ్డిగూడెం ఒకటి. 2011లో నగర పంచాయతీగా ఏర్పడింది. ప్రస్తుతం గ్రేడ్-2 మున్సిపాలిటీగా ఉన్న జంగారెడ్డిగూడెం పట్టణం ఇప్పటికే గ్రేడ్-1 మున్సిపాలిటీగా మార్పు చెందాలి. గత కొన్నేళ్లుగా మున్సిపల్ శాఖలోనే ఆ ఫైల్ పెండింగ్‌లోనే ఉంది. 2011లో నగర పంచాయతీగా ఉన్నప్పుడు అరకొర సిబ్బందితో నెట్టుకొచ్చారు. అప్పటినుంచి ఇప్పటి వరకు పద్నాలుగు ఏళ్లగా సిబ్బంది కొరతతో మున్సిపాలిటీ కొట్టుమిట్టాడుతుంది.

జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో ఖాళీలు ఇలా..

టీపీవో ఒకటి, ఏఈలు ఇద్దరు, పట్టణ సర్వేయర్ ఒకటి, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ ఒకరు, జూనియర్ అకౌంటెంట్‌లు ఇద్దరు, హెల్త్ అసిస్టెంట్లు ఇద్దరులో ఒకరు ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్లు ఆరుగురుకి మూడు పోస్టులు ఖాళీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒకటి, ప్రస్తుతం డిప్యూటేషన్‌పై చేస్తున్నారు.

మంజూరు చేయాల్సిన పోస్టులు :

డీఈ-1, రెవెన్యూ ఆఫీసర్-1, సీనియర్ అసిస్టెంట్లు-3, జూనియర్ అసిస్టెంట్లు-3.

మునిసిపల్ ఏఈల కొరత..

జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో ప్రస్తుతం ఒక డీఈ, ఇద్దరు ఏఈలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే ఏఈ ఉన్నారు. ఉన్న ఆ ఒక్క ఏఈ కూడా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఇక్కడ పనిచేసే ఏఈ సంధ్యారాణి ఏలూరు కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లగా 2023 అక్టోబరులో జంగారెడ్డిగూడెం మునిసిపల్ ఏఈగా పి.జ్వాలాదీప్తి విధుల్లో చేరారు. కొద్ది రోజులు విధులు నిర్వహించి 2024 నవంబరులో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి గత ఏడు నెలలుగా ఏఈ సెలవులోనే ఉన్నారు. దీంతో ఇన్‌చార్జి ఏఈగా స్థానిక ఐదో సచివాలయ సెక్రటరీకి బాధ్యతలు అప్పగించి వారిపైనే ఆధారపడుతున్నారు.

వచ్చిన వెంటనే వెళ్లిన టీపీవో ..

గత ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో) పోస్టు భర్తీ చేశారు. ఏలూరు కార్పొరేషన్‌లో టీపీఎస్‌గా పనిచేస్తున్న సాంబశివరావు ప్రమో టషన్‌పై ఈనెల 20న టీపీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే ఇక్కడ విధులు నిర్వహించకుండానే ఏలూరు కార్పొరేషన్ ఏసీపీగా డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. మళ్లీ టీపీవో పోస్టు ఖాళీ అయింది. ఈవిధంగా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి వచ్చిన అధికారులు విధుల్లో చేరి ఆ వెంటనే ఏదో ఒక రూపంలో మళ్లీ వెళ్లిపోతున్నారు.

సిబ్బంది నియామకానికి నివేదిక పంపించాం



మునిసిపాలిటీలో 2021 నుంచి సిబ్బంది నియామకంపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఇంకా అనుమతులు రాలేదు. ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వమే భర్తీ చేయాలి. ఒక్కోసారి సచివాలయాల్లో సిబ్బందిని కూడా అవసరాన్ని బట్టి వాడుకుంటున్నాం. సిబ్బంది కొరత వల్ల ప్రజల పనులు జరగడానికి ఆలస్యం అవుతుంది.

\- ఎంవీ రమణ
మునిసిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం.

అనాథగా ఏలూరు టౌన్ ప్లానింగ్ విభాగం

▸ మూడు నెలలుగా ఒక్క ప్లాన్ కూడా లేదు
▸ సిబ్బంది కొరతతో నగరాభివృద్ధి ఆదాయానికి గండి

ఏలూరు టూటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరపాలక సంస్థలో కాసులు కురిపించే టౌన్ ప్లానింగ్ విభాగం అనాథలా మారింది. ప్రభుత్వం తెచ్చిన జీవో 20వల్ల మూడు నెలలుగా ఒక్కప్లాన్ కూడా రాలేదు. ప్రతీనెలా రూ.50 లక్షలకుపైగా వచ్చే ఆదాయానికి గండిపడింది. ఈ ప్రభావం నగరాబివృద్ధిపై పడింది. దీంతోపాటు సిబ్బంది ఒక్కొక్కరు ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లతో వెళ్లిపోవడంతో పట్టణ ప్రణాళిక విభాగం బోసిపోతోంది. ఈ విభాగంలో ఇద్దరు అసిస్టెంట్ సిటీప్లానర్ (ఏసీపీ)లు ఉండాల్సినప్పటికీ ప్రస్తుతం లేదరు. వారిలో ఒకరైన ఒక ఏసీపీ ఇటీవలే రాజకీయ ఒత్తిళ్ల తట్టుకోలేక బదిలీపై వెళ్లిపోయారు. ఇద్దరు బిల్డింగ్ సూపర్‌వైజర్లకుగాను చాలాకాలంగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఉన్న ఒక్క బిల్డింగ్ సూపర్‌వైజర్ సాంబశివరావు టీపీవోగా పదోన్నతిపై జంగారెడ్డిగూడెం వెళ్లగా తిరిగి డిప్యూటేషన్‌పై ఇక్కడికి తీసుకువచ్చారు. సచివాలయంలోని ప్లానింగ్ సెక్రటరీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పీవో ఎస్.సురేఖ డిప్యూటీ సిటీప్లానర్‌గా అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వం నియమించినా సాంబశివరావు డిప్యూటేషన్‌తో ఆమె నియామకం ఆగిపోయింది. అటెండర్, ఆఫీస్ సిబ్బంది మాత్రమే మిగిలారు.



క్రైమ్ సమాచారం

జ్యూవెలరీ వ్యాపారి ఆత్మహత్య

▸ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఒక జ్యూవెలరీ వ్యాపారి జీవితంపై విరక్తితో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పువీధి ప్రాంతానికి చెందిన ఉప్పు నాగరాజు(61) ఏలూరు మెయిన్ బజారులో గాయత్రీ జ్యూవెలరీ షాపును నిర్వహిస్తున్నారు. 2024లో ఆయన హార్ట్‌కు స్టంట్ వేయించుకున్నారు. మరోవైపు షుగరు వల్ల ఒక కాలు సగభాగం తీసివేశారు. మెడ నరాలు దెబ్బతినడంతో ఆపరేషన్ చేయించుకోవడంతో పాటు మరోవైపు కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. అయినప్పటికీ ఆయన ఆరోగ్యం సహకరించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఉరి వేసుకున్నారు. కుటుంబసభ్యులు సహజ మరణంగా చెప్పి చుట్టుపక్కలవారికి చెప్పారు. ఉరి వేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మదీనా బాషా తన సిబ్బందితో వెళ్లి మృత దేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి శుక్రవారం పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

సీసలిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాళ్ళ, మే 30 (ఆంధ్రజ్యోతి): కాళ్ల మండలం సీసలిలో అడుగంటిన చెరువులో గుర్తుతెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఏఎస్‌ఐ వీవీఎస్ రామరాజు తెలిపిన వివరాలివి.. గ్రామంలో అడుగంటిన చెరువులో బోర్లాపడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. స్థానిక వీఆర్వో సుధాకర్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 40 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఒంటిపై నైట్ ప్యాంట్ మాత్రమే ఉండి కుళ్లిన స్థితిలో బాడీ ఉందన్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి మోటారు సైక్లిస్టు మృతి

ఉండి, మే30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఓ మోటారుసైక్లిస్టు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉండి ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. శుక్రవారం తెల్లవారుజామున భీమవరం నుంచి ఉండి మీదుగా ఆకివీడు వెళ్తున్న షేక్ షరీఫ్(42)అనే వ్యక్తి ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు, భార్య షేక్ పర్విదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్యాయత్నం

పెదవేగి, మే 30(ఆంధ్రజ్యోతి) : ప్రేమించినవాడు ఫోన్ తీయడం లేదని మనస్తాపానికి గురైన బాలిక విషపు గుళికలు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. పెదవేగి మండలానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఏడో తరగతి వరకు చదివి మానేసి ఇంటి దగ్గరే ఉంటోంది. ఆ బాలికకు తల్లి గతంలోనే మృతి చెందగా, తండ్రి ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన ఎచ్చు గణేష్ అనే యువకుడితో ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆ బాలిక ఫోన్‌ను కొద్దిరోజులుగా ఆ యువకుడు బ్లాక్ చేసి మాట్లాడడం లేదు. దీంతో మనస్తాపంతో గురువారం ఉదయం విషపు గుళికలు తిని అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్వీ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారని ఎస్‌ఐ తెలిపారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదంటూ అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తమామలు వేధించడంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరులోని ఆదివారపుపేటకు చెందిన సంది కీర్తి (20)ని 2023లో కృష్ణా జిల్లా మొవ్వ మండలం, మొవ్వ గ్రామానికి చెందిన నాగదేశి జోయల్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. పెళ్లయిన వారం రోజుల నుంచి తాగి వచ్చి ఆమెను చిత్రహింసలకు గురి చేశాడు. భరించలేక ఆమె పుట్టింటికి వచ్చి అప్పటినుంచి పుట్టింటి వద్దే ఉంటుంది. ఇటీవల అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్త,మామలు వేధించడంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యాచకుడి మృతి

భీమవరం క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): యాచక వృత్తి చేసుకుంటున్న ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భీమవరం గరగపర్రు రోడ్డులోని అండర్ టన్నెల్ లోపల ప్లాట్‌ఫాంపై ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అదే ప్రాంతంలో యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం మృతదేహాన్ని మునిసిపల్ సిబ్బందికి అందజేస్తామని, దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదన్నారు.

అప్పు మిగిల్చిన విషాదం: కుటుంబం ఆత్మహత్యాయత్నం

▸ కూల్ డ్రింక్‌లో కలుపు మందు కలుపుకుని తాగిన వైనం
▸ కుటుంబ యజమాని చికిత్స పొందుతూ మృతి
▸ చికిత్స పొందుతున్న భార్య, పిల్లలు



సత్యదుర్గ చంద్రరావు(ఫైల్)

జంగారెడ్డిగూడెం,మే 30 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధలు తాళలేక జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ముంగిన సత్యదుర్గ చంద్రరావు(38) అనే వ్యక్తి తనతో పాటు తన భార్య, ఇద్దరు పిల్లలకు కూల్ డ్రింక్‌లో కలుపు మందు కలిపి తాగించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం సృష్టించింది. ఈ ఘటనలో ఇంటి యజమాని సత్యదుర్గ చంద్రరావు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కృష్ణజ్యోతి, కుమారుడు దుర్గాచరణ్, కుమార్తె కోమలి ఐశ్వర్య చికిత్స పొందుతున్నారు. బంధువులు తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన సత్యదుర్గ చంద్రరావు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వివాహం అనంతరం బంధువుల సహకారంతో చిన్నగా వడ్డీ వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడు. తన భార్య, పిల్లలతో పట్టణంలోని బాలాజీ టవర్స్‌లో నివాసముంటున్నాడు. వ్యాపారం కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ బయట నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీలు సమయానికి చెల్లించలేకపోవడం, వడ్డీకి తీసుకున్న వారు సమయానికి చెల్లించకపోవడంతో సుమారు రూ.50 లక్షల పైనే అప్పులు పెరిగిపోవడంతో చనిపోవడానికి నిర్ణయించుకున్నాడు. ఈనెల 29న కలుపు మందు ఇంటికి తీసుకువచ్చి కూల్‌డ్రింక్‌లో కలిపి.. ఆయుర్వేదం కషాయం అని చెప్పి తాగితే మంచిదని భార్య, పిల్లలకు తాగించాడు. అనంతరం బంధువులకు కలుపు మందు తాగి చనిపోతున్నట్టు చెప్పగా వారు హుటాహుటిన వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ యజమాని మృతి చెందాడు. ప్రస్తుతం భార్య, పిల్లలు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.

నకిలీ వస్తువుల విక్రయ వ్యాపారి గుట్టురట్టు

▸ బ్రాండెడ్ పేరుతో నకిలీ ఎలక్ట్రికల్ వస్తువుల అమ్మకం
▸ కాకినాడలో విజిలెన్స్ దాడులు ▸ అదే యజమానికి భీమవరంలో దుకాణం

భీమవరం క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, గృహోపకరణాలైన పరికరాలను బ్రాండెడ్ పేరుతో నకిలీవి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఒక వ్యాపారి విషయం గుట్టు రట్టయింది. ఈమేరకు భీమవరం పట్టణంలోని మిగిలిన వ్యాపారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తి భీమవరం పట్టణంలో విద్యుత్ పరికరాల దుకాణం నడుపుతున్నాడు. రాష్ట్రంలో కొన్ని బ్రాంచీలను ఏర్పాటు చేశాడు. కాకినాడలో ఒక బ్రాంచి ఏర్పాటు చేసి నకిలీ విద్యుత్ పరికరాలను, వైర్లను, స్విచ్‌లను బ్రాండెడ్ పేరుతో విక్రయిస్తున్నాడన్న సమాచారంతో శుక్రవారం విజిలెన్స్ అధికారులు అక్కడ దాడులు చేశారు. దుకాణాన్ని సీజ్ చేసినట్లుగా సమాచారం. అదే యజమానికి భీమవరంలో దుకాణం ఉండడంతో ఇక్కడ కూడా నకిలీ వస్తువులు విక్రయిస్తున్నాడన్న ప్రచారం పెద్దఎత్తున జరగడంతో మిగిలిన విద్యుత్ పరికరాల వ్యాపారులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఇప్పటికే కొనుగోలు చేసిన కొందరు తమ గృహానికి నకిలీవి వేశామా, అసలైనవి వేశామా అనే అనుమానాలు వ్యక్తం చేసుకుంటున్నారు.

తుపాకీతో కుక్కలను కాల్చిన సంఘటనపై విచారణ

ఏలూరు క్రైం, మే30(ఆంధ్రజ్యోతి): తుపాకీతో కుక్కలను కాల్చి చంపిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఏలూరు శనివారపుపేట హైస్కూలు రోడ్డులో ఉన్న చింతమనేని కాలనీలో ఈనెల 27 సాయంత్రం ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి తొమ్మిది కుక్కలను తుపాకీతో కాల్చి చంపారు. అందులో పెంపుడు కుక్క ఉండడంతో ప్రశ్నించిన వారిని ఆగంతకులు బెదిరించిన విషయం పాఠకులకు విదితమే. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ఈ కథనం రావడంతో నిఘా విభాగాలు త్రీ టౌన్ పోలీసులు ఉదయాన్నే వెళ్లి విచారణ చేపట్టారు. ఆ షూటర్లను ఎవరు తీసుకువచ్చారు, వారు వినియోగించిన గన్ ఎలాంటిదనే దానిపై ఆరా తీశారు. ఈ సంఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయనున్నట్టు సమాచారం.

ఉమ్మడి జిల్లా బోధనేతర సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, మే 30:ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, భీమవరం, తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, దూబచర్ల డైట్ కళాశాల, ఐదు డివిజన్ల ఉప విద్యాశాఖాధికారుల (డీవైఈవో) కార్యాలయాలు, డీఈవో కార్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సాధారణ బదిలీలకు కౌన్సెలింగ్ శుక్రవారం రాత్రి ఏలూరు డీఈవో కార్యాలయంలో నిర్వహించారు. ఆఫీస్ సబార్డినేట్లు/రికార్డు అసిస్టెంట్లు 12 మంది, జూనియర్ అసిస్టెంట్లు 12మంది, అటెండర్లు ఐదుగురు, సీనియర్ అసిస్టెంట్లు నలుగురిని మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో కోరుకున్న స్థానాలకు బదిలీ చేసి, నియామకపత్రాలను జారీ చేశారు. బదిలీ ఐరారైన వారంతా శనివారం ప్రస్తుత స్థానాల్లో రిలీవై జూన్ ఒకటో తేదీన నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని ఉమ్మడి జిల్లా డీఈవో వెంకటల క్ష్మమ్మ ఆదేశించారు. కౌన్సెలింగ్ నిర్వహణలో అసిస్టెంట్ డైరెక్టర్లు షరీఫ్, అవధాని, సూపరింటెండెంట్లు పవన్, మోహన్, నరసింహారావు, ఏలూరు డీవైఈవో రవీంద్రభారతి, తదితరులు పాల్గొన్నారు. సూపరింటెండెంట్ కేడర్ అధికారులకు బదిలీ కౌన్సెలింగ్ శనివారం కాకినాడలో ఆర్జేడీ సమక్షంలో జరుగనుంది.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష

ఏలూరు క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి తీవ్ర గాయాలు కావడానికి మోటారు సైకిల్‌ను నిర్లక్ష్యంగా నడిపినట్టు ఒక వ్యక్తిపై నేరం రుజువు కావడంతో అతడికి ఆరు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ కె.స్పందన శుక్రవారం తీర్పు చెప్పారు. 2022లో మాదేపల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన రావాడ శ్రీనివాసరావు(38) మోటారు వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఒక వ్యక్తిని ఢీ కొన్నాడు. ఆ ఘటనలో ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఎక్సైజ్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన శ్రీనివాసరావుపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఖాసీం వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర సహకరించారు.

సినీ ప్రేక్షకుడి జేబుకు చిల్లు

▸ టికెట్ కంటే తినుబండారాలే అధిక రేటు
▸ మార్కెట్ ధరకు రెండింతలు వసూలు
▸ తూతూమంత్రంగా అధికారుల దాడులు

ఏలూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : వినోదం కోసం సినిమా థియేటర్‌కు వెళ్లే ప్రేక్షకుడు నిలువుదోపిడికి గురవుతున్నాడు. సినిమా టికెట్ ధర కంటే పాప్‌కార్న్, చిప్స్, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్ వంటి వాటికే ఎక్కువ చెల్లించాల్సి వస్తోంది. వాహనాల పార్కింగ్ అదనంగా చెల్లించాల్సిందే. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సినిమా చూడాలంటే నలుగురు సభ్యులున్న కుటుంబానికి కనీసం రూ.వెయ్యికి తగ్గకుండా ఖర్చవుతుంది. మల్టీఫ్లెక్స్ అయితే ఈ ఖర్చు మూడింతలపైనే. దీంతో సామాన్య జనం కుటుంబంతో కలిసి సినిమా థియేటర్ వైపు చూడాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 105 థియేటర్లు ఉన్నాయి. పెద్ద హీరోల సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తారు. ఇదే అదునుగా భావించిన థియేటర్ యజమానులు దోచుకుంటున్నారు. రెండున్నర గంటల సినిమా చూసేందుకు ఎంత ఖర్చు పెడతామో సినిమా విరామ సమయంలో పది నిమిషాలకు అంత ఖర్చు చేయాల్సి వస్తుందని ప్రేక్షకులు వాపోతున్నారు. థియేటర్‌లలో చిన్న పిల్లలు ఇష్టపడే తినే రూ.10 విలువ చేసే పలు ప్యాకెట్‌ను రూ.30కు అమ్ముతారు. బయట రూ.10చిన్న కూల్ డ్రింక్ బాటిల్ థియేటర్‌లో రూ.30కు కొనాల్సి వస్తుంది. మల్టీఫ్లెక్స్ అయితే ఈ ధర రూ.100కుపైనే రూ.10కి దొరికే కేక్ రూ.20 నుంచి రూ.30కి అమ్ముతారు. వెజ్, ఎగ్ పఫ్ ఏకంగా రూ.10 నుంచి 50 వరకు విక్రయించి దోచుకుంటున్నారు.



ఏలూరు సత్యనారాయణ థియేటర్‌లో గురువారం కూల్‌డ్రింక్ వివరాలు అడుగుతున్న తహసీల్దార్

సౌకర్యాలు అంతంత మాత్రమే..

సినిమా థియేటర్లలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండవు. తాగునీటి సౌకర్యాలు అంతంత మాత్రమే ఉంటాయి. సినిమాకు వెళ్లినప్పుడు వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదు. కానీ తప్పసరిగా ఫీజు వసూలు చేస్తారు. ఇటీవల అధికారులు ప్రేక్షకులు లేని సమయంలో వెళ్లి కొన్ని థియేటర్లు తనిఖీ చేశారు. అలా చేస్తే ప్రేక్షకుల సమస్యలు ఎలా తెలుస్తాయని సినీ అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి

కొత్త సినిమా విడుదలైతే బ్లాక్‌లో టికెట్లు విక్రయించి ప్రేక్షకుడిని నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆ తరువాత ఆన్‌లైన్ టికెట్‌కు మాత్రమే జీఎస్టీ చెల్లించి, మిగిలిన మాన్యువల్ టికెట్‌కు జీఎస్టీ చెల్లించకుండా సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సైతం ఆయా యాజమాన్యాల వద్ద ముడుపులు తీసుకుని పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చనలు

ఏలూరు కార్పొరేషన్, మే 30(ఆంధ్రజ్యోతి) : అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీ దేవి, కనకదుర్గాంబ అమ్మవార్ల ఆలయాల వద్ద మహిళలు శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అంబికా ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనలు జరిపారు. సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఆలయ అర్చకులు సాయి ఫణిశర్మ మహిళలతో సామూహిక కుంకుమార్చనలు జరిపించారు. బావిశెట్టివారిపేటలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద శ్రీహరిశర్మ కుంకుమ పూజలు జరిపించారు.

సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా చేబ్రోలు ఎంపిక

ఉంగుటూరు,మే 30(ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు గ్రామాన్ని సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఎంపిక చేశారు. జిల్లా మొత్తం మీద చేబ్రోలు గ్రామాన్ని లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా నిర్ణయించారు. దీంతో శుక్రవారం గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడంతో పాటు పారిశుధ్య పనులు చేపడుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో గత మూడ్రోజులుగా పారిశుధ్యం పనులు నిర్వహిస్తున్నట్టు డివిజినల్ అధికారి చంద్రశేఖరరావు తెలిపారు.

నేడు వాటర్ ట్యాంక్‌లకు శంకుస్థాపన

దెందులూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు శనివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేయనున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు), పార్టీ క్యాదర్శి నాగనబోయిన సత్యనారాయణ తెలిపారు. చల్లచింతలపూడి, గాలాయగూడెం, గోపన్నపాలెం, కొత్తపల్లి, సోమవరప్పాడు, ఆర్‌టీసీ కాలనీల్లో శంకుస్థాపనలు చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు చల్లచింతలపూడిలో పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన స్థలాలను తాగునీటి సరఫర విభాగం ఎఈ చింతమనేని వర్మలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మోతుకూరి నాని, యలమర్తి శ్రీనువాస్, ముమ్మడి మోహన్‌రావు, గారపాటి కొండయయ్య చౌదరి, మాగంటి గిరిబాబు, పూజారి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ పుసులూరి ప్రసాద్, వేమన రాముగౌడ్‌లతో పాటు పార్టీ నాయకులు ఉన్నారు.

వివాదాస్పదమైన భూములు సేకరించొద్దు

బుట్టాయగూడెం, మే 30(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కేటాయించేందుకు వివాదంలో ఉన్న భూములను పరిశీలించడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రెడ్డిగణపవరంలో కోర్స జలపాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లోని నిర్వాసితులకు బుట్టాయగూడెం మండలంలో భూసేకరణ చేస్తున్నారని, వివాదాస్పదమైన భూములను అధికారులు సేకరించేందుకు చూస్తున్నారని తెలిపారు. వివాదం లేని భూములనే నిర్వాసితులకు ఇవ్వాలని, 30 ఏళ్లుగా గిరిజనులు సాగులో ఉన్న ఎల్‌టీఆర్, 1/70 చట్టం భూముల కొనుగోలును ఆపాలని డిమాండ్ చేశారు. అధికారులు కాసులకు కక్కుర్తిపడి వివాదాస్పదమైన భూములను కొనుగోలుకు తెరలేపారన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెట్టి వీరయ్య, ఉనుముల సూర్యచంద్రం పాల్గొన్నారు.

దెందులూరు ప్రభుత్వాస్పత్రిలో శస్త్రచికిత్సలు

దెందులూరు, మే 30(ఆంధ్రజ్యోతి) :దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తొలిసారిగా గర్భసంచి, అండాశయం, కణుతుల తొలగింపు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు(అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు)డాక్టర్ బి.సుందర్‌బాబు తెలిపారు. శుక్రవారం దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శాలిని, పలువురు డాక్టర్లతో కలిసి మాట్లాడుతూ దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ, సిజేరియన్, అన్నిరకాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే పాము, కుక్క, తేలు కాటుకు వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. గుండె పోటు వచ్చిన వారికి రూ.40 వేల విలువ చేసే ఇంజక్షన్‌లు ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నెల రోజుల్లోనే 96 ఆపరేషన్లు చేశామన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు

ఏలూరు అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా 'ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్' ప్రధానాంశంగా బాలబాలికలకు క్విజ్, పోస్టర్ తయారీ పోటీలను నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి చెన్నై శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ఆర్జేడీ ఈ పోటీలను నిర్వహిస్తారని వివరించారు. 'ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణంపై దానిప్రభావం' అనే అంశంపై 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోస్టర్ తయారీ పోటీ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులను కేటగిరి-ఏ, 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులను కేటగిరి-బిగా విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ ఎంట్రీలను ఆన్‌లైన్ లేదా క్యూఆర్ కోడ్ సహాయంతో 4న సాయంత్రం 5 గంటల్లోపు పంపాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

పెదవేగి, మే 30(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు సమాజానికి ఒక రుగ్మతగా మారాయని పెదపాడు అదనపు సీడీపీవో ఎం.సునీల్ రాజశేఖర్ అన్నారు. పెదవేగి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొంతమంది బాల్య వివాహాల ప్రయత్నాలు చేస్తున్నారని, సమాచారం ముందుగానే తెలుసుకుని, వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. పెదవేగి సెక్టార్ సూపర్‌వైజర్ సి.హెచ్.పార్వతి యోగాతో కలిగే లాభాలు, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, అనూరాధ, మల్లిక, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

పెదవేగి, మే30(ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఆగడాలు మితిమీరి పోయాయని, వారి ఆగడాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పెదవేగి మండలం కె.కన్నాపురం గ్రామానికి చెందిన కమ్మిలి భాస్కరరావు ఫైనాన్స్ సంస్థల బెదిరింపులతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడంతో బాధిత కుటుంబాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ భాస్కరరావు మృతి బాధాకరమని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇద్దరు చిన్నపిల్లలు, వృద్ధురాలైన అత్తగారి బాధ్యత ఇప్పుడు మృతుడి భార్య మనీషాపై పడిందని, ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి : రోషన్

లింగపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి):రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. మండలంలో చింతలపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి కృషి చేస్తున్నారని అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని అందులో పట్టాయగూడెం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ముత్తారెడ్డి, బెంకటరామయ్య, మదుబాబు పాల్గొన్నారు.

యర్రచెర్వులో యథేచ్ఛగా కంకర తవ్వకాలు



తవ్వకాలు జరుపుతున్న గుట్ట

ఉంగుటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక యర్రచెర్వులో పంచాయతీ తీర్మానం చేసిన నేపథ్యంలో సాంకేతికంగా అనుమతులు రాకుండానే కంక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. రాజకీయ పలుకుబడితో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. గొల్లగూడెం - ప్రకాశరావుపాలెం మధ్యలో కంకర గుట్టలను తవ్వుకునేందుకు మైనింగ్ అధికారులు రెండు వేల క్యూబిక్ మీటర్ల వరకు అనుమతినిచ్చారు. కాగా ఇదే అదునుగా అసలు ప్రాంతానికి బదులు వేరొక చోట తవ్వకాలు సాగిస్తున్నారు. యర్రచెర్వులోని 25 ఎకారాల విస్తీర్ణంలో నాణ్యమైన కంకరను తవ్వుకుంటున్నారు. దీనిపై కార్యదర్శి బొడ్డు రవి కుమార్ మాట్లాడుతూ పంచాయతీ తీర్మానం చేసిందని అయితే సాంకేతిక అనుమతులు రాలేదన్నారు. ఈ తవ్వకాలపై తహసీల్దార్ పి.రవి కుమార్ మాట్లాడుతూ తాము ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ పని మీద ఏలూరు నగరానికి వచ్చిన దంపతుల్లో భార్య అదృశ్యమైందని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన గౌతమికి, మండవల్లి మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన మామిడి శివ సత్య వర ప్రసాద్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పుట్టింటికి వచ్చేసింది. అయితే పెద్దల ద్వారా పరిష్కరించుకోవడానికి శుక్రవారం కొవ్వలి గ్రామానికి వరప్రసాద్ వెళ్లాడు. ఉదయం పెద్దల ద్వారా సమస్య పరిష్కరించుకున్నారు. ఏలూరు బ్యాంకులో తాకట్టులో ఉన్న నగదును విడిపించడానికి వరప్రసాద్, గౌతమిలు కలిసి వచ్చారు. తాను వెళ్ళి గోల్డ్ తీసుకొస్తానని చెప్పి ఏలూరు పాత బస్టాండ్ నుంచి భర్తను వెనక్కు పంపింది. సాయంత్రం వరకూ చూసినప్పటికి ఆమె ఆచూకీ కానరాకపోవడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతులకు సమృద్ధిగా సాగునీరందిస్తాం

ఎమ్మెల్యే చింతమనేని



పూడికతీతను పరిశీలిస్తున్న చింతమనేని

పెదవేగి/దెందులూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : కాలువ చివరి ఎకరానికి కూడా సాగునీరందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు మండలం సత్యనారాయణపురం దగ్గర గోదావరి కాలువ పూడికతీత పనులను శుక్రవారం సాయంత్రం ప్రభాకర్ పరిశీలించారు. పనులు జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. కాలువ గట్టు మరింత పటిష్ఠంగా ఉండాలని, కాలువలో ఎక్కడా అడ్డంకులు లేకుండా పనులు చేయాలని సూచించారు. రైతులకు పుష్కలంగా సాగునీరందించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజను ప్రారంభం నాటికి సాగునీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పిన ఆయన కాలువ మరమ్మతు పనులు పూర్తిచేసేలా సత్వర చర్యలు చేపట్టాలని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, సత్యనారాయణపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు, పోతునూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు చలసాని రాంబాబు, నీటి పారుదల శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : మద్దిపాటి

ద్వారకాతిరుమల, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని ద్వారకాతిరుమల, తిమ్మాపురం, గొల్లగూడెం, తిరుమలంపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం జరిగిన గ్రామదర్శినిలో ఆయన పాల్గొన్నారు. తన సొంతసొమ్ము, అలాగే పలువురు టీడీపీ నేతల సాయంతో కొనుగోలు చేసిన సుమారు రూ.3.50 లక్షల విలువైన 14 బెడ్లను ఆయన పీహెచ్‌సీకి అందజేశారు. అనంతరం ద్వారకాతిరుమల, తిమ్మాపురం గ్రామాల్లో గ్రామదర్శిని సభల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు లంకా సత్యన్నారాయణ, పోలిన శ్రీనివాసరావు, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, లక్ష్మీరమణి, పాకలపాటి గాంధీ, ఏపూరి దాలయ్య, ఎం.బద్రి, శామ్యూల్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులపై దృష్టిపెట్టాలి

లింగపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల్లో భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ అన్నారు. లింగపాలెంలోని మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. భూసారాన్ని పెంచేందుకు పిల్లిపెసర, జనుము, జీలుగులు లాంటి పచ్చిరొట్ట ఎరువులను వాడాలన్నారు. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంచితే సహించం

ఏలూరు కార్పొరేషన్, మే 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కూటమి ప్రభుత్వం పెంచిన ఆస్తి పన్నును ఉపసంహరించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మునిసిపాలిటీల్లో ఆస్తి పన్నును 20 శాతం పెంచాలని నిర్ణయించి ఆ మేరకు కొలతలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గతంలో ఇంటి అద్దెల ఆధారంగా పన్నులు వేస్తే నేడు భూమితో కలుపుకుని ఆస్తి విలువను అంచనా వేసి దాని ఆధారంగా ఆస్తి పన్ను నిర్ణయించే పద్ధతికి ప్రభుత్వాలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం పన్నుల భారం 20 శాతానికి పెంచేందుకు సిద్ధమైందని అన్నారు. పెంచిన ఆస్తి పన్నుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రవి హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన

పోలవరం, మే 30(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పోలవరంలో డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త విధానాల్లో మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బెట్టింగ్ యాప్‌లకు ఆన్‌లైన్ జూదాలకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విశాఖ వర్క్‌షాపునకు సర్పంచ్‌లు

భీమడోలు, మే 30(ఆంధ్రజ్యోతి) : విశాఖపట్టణంలో జరిగిన పంచాయతీ రాజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ వర్క్‌షాపునకు భీమడోలు, పూళ్ల సర్పంచ్‌లు పాము సునీత, గాయం సుజాతలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 లక్షలకు పైబడి ఆదాయాలు ఉన్న గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు ఏ విధంగా సృష్టించాలనే అంశంపై పంచాయతీ రాజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాపుకు సర్పంచ్‌లు హాజరయ్యారు.

యోగాపై అవగాహన కల్పించాలి

పెదవేగి, మే 30(ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పెదవేగి మండల పరిషత్ ఈవోపీఆర్డీ షేక్ అమీర్ షరీఫ్ అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులుగా సచివాలయ సిబ్బందికి ఇస్తున్న యోగాంధ్ర శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ అమీర్ షరీఫ్ మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరికీ దగ్గర చేయాలనే సంకల్పంతో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యలతో యోగా మాసోత్సవం జరుగుతుందన్నారు. వచ్చే నెల 21వ తేదీ వరకు జరిగే ఈ యోగా మాసోత్సవాల్లో ప్రజలందరికీ యోగా ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి పి.సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ అల్లీ సాహెబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గన్నిని సత్కరిస్తున్న నాయకులు కిశోర్, సత్తిపండు

గన్నికి మండల నాయకుల కృతజ్ఞతలు

జంగారెడ్డిగూడెం/ ఏలూరు టూటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు కొండ్రెడ్డికిశోర్, టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కు మార్‌లను వేర్వేరుగా కలిసి శుక్రవారం ఘనంగా సత్కరించారు. కడపలో జరిగిన మహానాడు విజయవంతమైందని మరింత జోష్‌లో పార్టీ శ్రేణులు ఉన్నారని గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే రోషన్ సూచించినట్టు కిశోర్ తెలిపారు. ఆప్కాబ్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గన్ని వీరాంజనేయుల్ని ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఏఎంసీ చైర్మన్ పూజారి నిరంజన్, డీసీసీబీ ఉద్యోగుల యూనియన్ జనరల్ సెక్రటరీ జీ.శ్రీనివాసరావు, సీహెచ్‌వీ సత్యనారాయణలు పాల్గొన్నారు.

రేషన్ దాకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

టి.నర్సాపురం, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వినియోగదారులకు నిత్యావసర సరుకులను జూన్ 1 నుంచి రేషన్ షాపుల వద్దనే పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని టి.నర్సాపురం, బొర్రంపాలెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, అప్పలరాజుగూడెం, తిరుమలదేవిపేట గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కొత్త దుకాణం.. పాత సరుకు

(మూడో పేజీ తరువాయి)

పశ్చిమలో 1,052 దుకాణాలను ప్రారంభిస్తారు. వీటి ద్వారానే వినియోగదారులందరికీ సరుకులు అందజేస్తారు.ఈ-పోస్ యంత్రాలను డీలర్లకు అందజేశారు. వినియోగదారుల సంఖ్యను బట్టి కావాల్సిన సరుకులను శుక్రవారం కేటాయించారు.శనివారం నాటికే సరుకంతా దుకాణాలకు చేరేలా చర్యలు తీసుకో వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు కొంతమందికి అనువుగా వున్న రేషన్ సరఫరా వాహనాలను ఇప్పటికే తొలగించి వాటిలో ఉన్న ఎలక్ట్రానిక్ కాటా,బయోమెట్రిక్ యంత్రం, ఇతరత్రా రెవెన్యూ అధికారులు స్వాధీన పర్చుకున్నారు. వాటినే డీలర్లకు అందించారు. సాధ్యమైనంత మేర రేషన్ దుకాణాలు అన్నింటిని ఆదివారం అట్టహాసంగా ప్రారంభించాలని అంతర్గత ఆదేశాలు వెలువడ్డాయి. కూటమి పక్షాలకు చెందిన నేతల ద్వారా ఆయా రేషన్ దుకాణాలు ప్రారంభించాలని సూచించారు. ఆ మేరకు ఇప్పుడు డీలర్లంతా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కొత్త సరుకంటూ లేదు..

ఎప్పటి మాదిరిగానే ఈసారీ బియ్యం, పంచదార తోనే సరిపెట్టబోతున్నారు. గత ఫిబ్రవరిలో కందిపప్పు, మైదా అదనంగా అందించినా ఆ తర్వాత నెల నుంచి వాటి సరఫరా నిలిపివేశారు. వినియోగదారులంతా కంది పప్పు తక్కువ రేటుకు కార్డుపై అందించాలని అప్పటి నుంచి అభ్యర్థిస్తూ వచ్చారు. కానీ సర్కారు ఆ వైపు తొంగి చూడలేదు. దీనికి తోడు రేషన్ దుకాణాల్లో విలేజ్ మాల్స్ తలపించేలా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుతామని మరో ప్రకటన చేశారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

పట్టణ సమస్యలపై విస్తృత చర్చ



చైర్ పర్సన్ నాగలక్ష్మి

జంగారెడ్డిగూడెం, మే 30(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించే సుమారు రూ.60లక్షల అభివృద్ధి పనులను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చిటికెల అచ్యుత రామయ్య, పీపీఎస్ చంద్రరావు మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.నాల్గవ వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో ప్రధాన రహదారి పక్కన సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు వేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ఆస్తులను సంరక్షించాలని కోరారు.పట్టణంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ ఎంవి.రమణ, వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్లు నంబూరి రామ చంద్ర రాజు, టి.జ్యోతి, నేకూరి కిశోర్ పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

యుద్ధ ప్రాతిపాదికన అభివృద్ధి పనులు

ఏలూరు టూటౌన్, మే30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. శుక్రవారం నూజివీడు, ఏలూరు నూతనంగా నిర్మిస్తున్న రోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే నగరంలో రూ.4కోట్ల విలువ చేసే రోడ్లు నిర్మించామన్నారు. దాదాపు రూ.కోటి వ్యయంతో గుంతలు పూడ్చామని, మరో రూ.5 కోట్లతో నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు.

మహానాడు విజయవంతం : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, మే30 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనంతగా వైభవంగా టీడీపీ మహానాడు జరిగిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.కడపలో మహానాడు సక్సెస్ అవ్వడంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. టీడీపీ మీద ఉన్న అభిమానంతో లక్షల సంఖ్యలో కార్యకర్తలు మహానాడుకు తరలివచ్చారని అన్నారు. ఇది చూసి వైసీపీ నాయకులు అనేక విమర్శలు చేస్తున్నారన్నారు. మహానాడు తరలి వచ్చిన టీడీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.



సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

బదిలీపై వెళ్తున్న పోలీసులకు సత్కారం

ఉంగుటూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : నిడమర్రు సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న 18 మంది పోలీసులను కౌన్సెలింగ్‌లో భాగంగా బదిలీ చేశారు. గురువారం రాత్రి స్థానిక చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో జరిగిన బదిలీపై వెళ్తున్న సిబ్బందిని ఉద్దేశించి సీఐ మోగంటి వెంకట సుబాశ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అనేక లోటు పాట్లు ఉంటాయని పోలీస్ ఉద్యోగం నిత్యం సవాళ్లతో కూడుకున్న పని అన్నారు. అనంతరం నిడమర్రు, చేబ్రోలు, గణపవరం స్టేషన్లకు సంబంధించిన 18 మందిని సత్కరించి వారికి యూనిఫాంతో పాటు జ్ఞాపికను అందించారు.అనంతరం సి.ఐ. సుబాశ్‌తో పాటు ఎసైలు మణికుమార్, సుధాకర్, ఎం.సూర్య భగవాన్ పాల్గొన్నారు.

వట్లూరు స్కూల్లో హాల్ ప్రారంభం

పెదపాడు, మే 30(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. వట్లూరు జడ్పీ హైస్కూల్లో ధూళిపాల రాధాకుమారి ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన అసెంబ్లీ హాల్ ప్రాంగణాన్ని ఎమ్మెల్యే చింతమనేని శుక్రవారం ప్రారంభించారు. ఈ మేరకు దాతను ఎమెమ్మల్యే ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, ఉప్పలపాటి రాంప్రసాద్, మండలాధ్యక్షులు మరడాని రవి, క్లస్టర్ ఇంచార్జి గుత్తా అనిల్, ముళ్ళపూడి సాంబశివరావు, పొలుపర్తి కన్నారావు పాల్గొన్నారు.

దోమల వృద్ధిని అరికట్టాలి

ఏలూరు రూరల్/ఉంగుటూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతీ ఒక్కరూ ఫ్రైడే డ్రైడే ఆచరించాలని అప్పుడే దోమల ద్వారా వచ్చే అంటువ్యాధులను కొంత వరకు అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి పి.ఎస్.ఎస్.ప్రసాద్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మల్కాపురంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి పరిసరాల పరిశుభ్రత అవగాహన కల్పించి డెంగీ, మలేరియా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య విస్తరణాధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, జోషి, ఆరోగ్య కార్యకర్త అభిలాష పాల్గొన్నారు.

● ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు, కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని హస్టళ్లలో దోమల నివారణకు మందు స్ప్రే చేయించారు. వైద్యాధికారులు కె.ఎస్.వర్మ, మానసల ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మలేరి యా యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావులు మందు స్ప్రేయింగ్ చేయించారు.

● నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో కీటకాల ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కీటక జనిత వ్యాధుల నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. శుక్రవారం బీసీ హాస్టల్లో మాలతియాన్ 25 శాతం ఫోకల్ స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కృపావరం,చంద్రరావు, బేబి కల్యాణి, సీత, మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్-23 వన్డే క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లలో పాల్గొనడానికి అండర్-23, వన్డే క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్టు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ తెలిపింది. కె.రేవంత్ నాగకుమార్(కెప్టెన్), పి.భువనేశ్వర్ (వైస్ కెప్టెన్), కెఎస్ఎన్ హరీష్, వీఎంవిఎస్ రక్షణ్, కె.ప్రణీత్ పవన్, కె జాన్ రిచర్డ్స్, వి.జాష్విన్, ఎం.హర్షవర్ధన్, జి.దీపక్‌చంద్, జి చరణ్‌సాయితేజ, డి.యశ్వంత్, ఎండీ మోహబూబ్ ఆలీ, వై చైతన్యకుమార్, బిహెచ్ సాయి సుశాంత్, పార్థవ్ శ్రీసాయి, కెఎస్ఎన్ రాజులు ఎంపికయ్యారు.

ఆటో డ్రైవర్లు లౌడ్ స్పీకర్లు వాడొద్దు

చింతలపూడి, మే 30(ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని చింతలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో యూనియన్ ప్రతిష్ఠ పెరగాలంటే ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అధిక లోడు వేయవద్దని, ఆటో డ్రైవ్ చేసేటప్పుడు లౌడు స్పీకర్లు వాడొద్దని సూచించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

కామవరపుకోట, మే 30(ఆంధ్రజ్యోతి) : తూర్పు యడవల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దివంగత మాజీ మంత్రి కోటగిరి విద్యాధరరావు సతీమణి కోటగిరి విజయకుమారి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి, మే 30(ఆంధ్రజ్యోతి) : రాయన్నపాలెం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు రాయన్నపాలెం, కొండలరావుపాలెం, రాట్నాలకుంట, లేళ్లగూడెం, చింతలపాటివారిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా విజయరాయి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని విజయరాయి, గాంధీనగర్, ముత్తనవీడు, జంగాలవారిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ కోర్స్ ప్రారంభం

బుట్టాయగూడెం, మే 30(ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌లో వృత్తి విద్యా కోర్సుగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సంజీవని కుసుమ తెలిపారు. ఉద్యోగావకాశాలకు మెరుగుపరచే దిశగా విద్యార్థుల కోసం కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం ఆందోళన

బుట్టాయగూడెం, మే 30(ఆంధ్రజ్యోతి) : తాగునీరు అందించాలని కోరుతూ కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్డిగణపవరంలో స్థానికులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ మూడ్రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించకుంటే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.శివ, కె.యూన్సీ, పి.రాధ, కె.బాబూరావు, కె.విమల, పి.కుమారి, కె.జ్యోతి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ద్వారకాతిరుమల, మే 30(ఆంధ్రజ్యోతి) : సచి వాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్, ఏపీఎస్ హెచ్‌సీఎల్ ఎండీ ఎం.శివప్రసాద్ సూచించారు. మండలంలోని గుణ్ణంపల్లి సచివాలయాన్ని, అనంతరం హౌసింగ్ ప్రాంతాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలను పరిశీలించి త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎస్ఈ జయరామాచారి, పీడీ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.



ట్రై సైకిళ్లు అందజేస్తున్న దాతలు

ట్రైసైకిళ్లు, కుట్టుమిషన్ల వితరణ

ఏలూరు రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి) : ఏలూరుకు చెందిన కొనకళ్ల వెంకట రామకృష్ణారావు, ఆదిలక్ష్మి దంపతులు కుమారుడు కొనకళ్ల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. శుక్రవారం కుమారుడు శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో కె.వి.పి.రామనాథన్, చెక్క కిశోర్, మద్దుల పవన్ కుమార్, టంగుటూరి వీరవెంకట సత్య రవికుమార్, స్వర్ణలత పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినం

కుక్కునూరు, మే30(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం కుక్కునూరులో నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి వై.సాయికిరణ్ మాట్లాడుతూ ఐక్యపోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. శ్రమదోపిడీకి గురవుతూ పని చేస్తున్న కార్మికులను సంఘటితపరిచి సమస్యలపై ఉద్యమించడమే సీఐటీయూ లక్ష్యమన్నారు. అలాగే 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో నాగేంద్రరావు, బాడిత సుజాత, వలిబాష, సురేశ్, లక్ష్మణరావు, రమేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

టి.నర్సాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం పంచాయతీలో ఉన్న అల్లూరి సీతారామరాజు నగర్ (ఏఎస్ఆర్ నగర్) గ్రామాన్ని పంచాయతీ గుర్తించాలని గ్రామానికి తాగునీరు, రోడ్లు, కరెంటు, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు బైఠాయించారు. కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా గ్రామ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందించిన ఫలితంలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

బోధనాసుపత్రుల్లో జనౌషధి దుకాణాలు

» రెడ్‌క్రాస్ సొసైటీకి కేటాయింపు

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): రోగులకు తక్కువ ధరకు, నాణ్యమైన మందులు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జనౌషధి దుకాణాలను రెడ్‌క్రాస్ సొసైటీకి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బోధనాసుపత్రుల్లో ప్రయివేటు వ్యక్తులు జనరిక్ మందుల షాపులను నిర్వహిస్తున్నారు. వారు లాభార్జనే ధ్యేయంగా వీటిని నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు నాణ్యమైన జనరిక్ మందులు తక్కువ ధరలకే అందించేందుకు వీటిని రెడ్‌క్రాస్ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆమేరకు రెడ్‌క్రాస్ సొసైటీ 26 జిల్లాల్లోని బోధనాసుపత్రుల్లో షాపులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ప్రధాన మంత్రి జనౌషధి పరియోజన(పీఎంబీజేపీ) పథకంలో భాగంగా రెడ్‌క్రాస్‌కు అనుమతులు జారీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు, ఆర్అండ్‌బీ అధికారులతో సమన్వయం చేసుకుని అద్దె ధరలు నిర్ణయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. షాపుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)ను ఆదేశించారు.

రాష్ట్రపతి విశాఖ పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

» అధికారులకు సీఎస్ ఆదేశం

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 10న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశాఖపట్నంలో జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం అమరావతి సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న మినిట్ టు మినిట్ ప్రోగ్రామ్ ప్రకారం జూన్ 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు రాష్ట్రపతి విమానంలో విశాఖపట్నం చేరుకుంటారని, మధ్యాహ్నం 3 గంటల వరకూ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని, ఆ తర్వాత 3.20 గంటలకు విమానంలో ఝార్ఖండ్ రాష్ట్ర పర్యటనకు వెళతారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రపతి పర్యటన మినిట్ టు మినిట్ కార్యక్రమం, తదితర వివరాలను రాష్ట్రపతి కార్యాలయ ఆమోదం నిమిత్తం వెంటనే పంపాలని వర్చువల్‌గా పాల్గొన్న వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కట్టిమణిని సీఎస్ ఆదేశించారు.

ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌కు అహంకారం తగ్గలేదు: భానుప్రకాశ్‌రెడ్డి

న్యూఢిల్లీ, మే 30(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్ అవినీతి, అక్రమ పాలనను సహించలేక ప్రజలు 11 సీట్లిచ్చి బుద్ధిచెప్పినా ఆయనకు అహంకారం మాత్రం తగ్గలేదు' అని బీజేపీ ఏపీ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ప్రజల్ని ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. శుక్రవారం, ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు వైఎస్ జగన్‌కు లేదు. జగన్ పాలనలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వానికి ఏడాది పట్టింది. జగన్ తన పాలనలో ఏపీని అవినీతి, అక్రమాలకు చిరునామాగా మార్చారు. గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు. వైసీపీ పాలనలో జరిగిన మద్యం, ఇసుక, మైనింగ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరుపుతుంది. దోషులుగా తేలితే చట్టపరిధిలో శిక్షిస్తాం' అని భానుప్రకాశ్ అన్నారు.

తుంగభద్ర క్రస్ట్‌గేట్‌ల తయారీకి బిడ్‌లు

» ఈ-టెండరులో పాల్గొన్న 4 కంపెనీలు

బళ్లారి, మే 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ల తయారీకి ఈ-టెండర్‌లో నాలుగు కంపెనీలు బిడ్‌లు వేశాయి. పనులు చేసేందుకు వీటికి అర్హత ఉందా లేదా అన్న విషయాన్ని జూన్ 4, లేదా ఐదో తేదీన అధికారులు నిర్ధారించనున్నారు. ఇంతకు మునుపు ఈ-టెండర్‌లో బిడ్ వేసిన కంపెనీల్లో మూడింటికి అనుభవం లేదని, మరో కంపెనీ తన అనుభవాన్ని పొందుపరలేదని వాటిని తిరస్కరించారు. కాగా, డ్యాంకు మొత్తం 33 క్రస్ట్ గేట్లు ఉండగా, 19వ క్రస్ట్‌గేట్ మినహా 32 క్రస్ట్‌గేట్‌ల ఏర్పాటుకు రూ.60 కోట్లతో టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. 19వ క్రస్ట్‌గేటు ఏర్పాటు పనులను గుజరాత్‌కు చెందిన ఓ కంపెనీకి అప్పగించారు. ప్రస్తుతం పశ్చిమ కనుమల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. డ్యాంకు వరద మొదలైంది. 1000 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఈ కారణంగా ఈ ఏడాది 19వ గేటు ఏర్పాటు కూడా సాధ్యం కాకపోవచ్చని అధికారులు అంటున్నారు.

తప్పు ఎవరిదైనా విద్యార్థుల జేబు ఖాళీ!

(మొదటి పేజీ తరువాయి)

ఫీజు చెల్లించాలి. ఎన్ని సబ్జెక్టులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరితే అంత మొత్తం చెల్లించాలి. ఈ ఏడాది 64,251 పేపర్లకు రీవెరిఫికేషన్ కోసం రూ.6.42 కోట్లు విద్యార్థులు చెల్లించారు. రీకౌంటింగ్ కోసం 2,112 పేపర్లకు రూ.10.56 లక్షలు చెల్లించారు. వీరిలో సుమారు 11 వేల మందికి మార్కుల్లో మార్పు వచ్చింది. విద్యార్థులు ఊహించినట్లుగా మూల్యాంకనంలో పొరపాట్లు జరగడం వల్ల మార్కులు పెరిగాయి. ఈ 11 వేల మంది సుమారు రూ.కోటి దరఖాస్తు ఫీజు రూపంలో కట్టారు. అయితే, మార్కులు పెరిగిన తర్వాత తమ ఫీజులు ఎందుకు వెనక్కి ఇవ్వరని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ అంటే పేపర్లను మళ్లీ పరిశీలించాలి కాబట్టి ఆ మేరకు దరఖాస్తు ఫీజులు నిర్ణయించారు. అయితే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ అనంతరం మార్కులు పెరగకపోతే అది విద్యార్థుల పొరపాటే అవుతుంది. కానీ, మార్కులు పెరగడం అంటే అది ఖచ్చితంగా ఆ పేపరు దిద్దిన వారి పొరపాటు అవుతుంది. అంటే దానికి పాఠశాల విద్యాశాఖ బాధ్యత వహించాలి. ఈ నేపథ్యంలో మార్కులు పెరగకపోయినా, పెరిగినా ఫీజులు మాత్రం వెనక్కి ఇవ్వకపోవడం అనే విధానం సరికాదనే వాదన వినిపిస్తోంది. పాఠశాల విద్యాశాఖ తప్పు చేస్తే దాన్ని నిరూపించేందుకు తామెందుకు ఫీజులు చెల్లించాలనేది విద్యార్థుల ప్రశ్న. కొందరు విద్యార్థులు అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి కూడా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేస్తూ ఉంటారు. అలాంటి వారి వల్ల పాఠశాల విద్యాశాఖ సమయం వృథా అవుతుంది కాబట్టి ఫీజులు తీసుకోవడంలో అర్థం ఉందని, కానీ మూల్యాంకనం చేసిన వారి పొరపాట్లకు తాము మానసిక క్షోభ అనుభవించడంతో పాటు ఫీజు కూడా కట్టాలా? అని ప్రశ్నిస్తున్నారు. ఫలితాల అనంతరం మార్కులు పెరిగితే ఫీజులు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడు రోజుల్లోనే మూల్యాంకనం

ఈ ఏడాది 6,19,286 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. ఏప్రిల్ 3న మూల్యాంకనం ప్రారంభించిన అధికారులు ఏడు రోజుల్లోనే ముగించారు. దీనిపైనా విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దాదాపుగా ఇవే సంఖ్య ఉన్న పేపర్లను 10 నుంచి 15 రోజుల పాటు మూల్యాంకనం చేసేవారు. కానీ గత కొంతకాలంగా మూల్యాంకనం తీరు మారింది. త్వరగా ఫలితాలు ఇవ్వాలనే తొందరలో అధికారులు టీచర్లను మూల్యాంకనం విషయంలో పరుగులు పెట్టిస్తున్నారు. ఉదాహరణకు ఒక టీచర్ రోజుకు కనీసం 40 పేపర్లు దిద్దాలి. ఒకవేళ టీచర్ ఒక రోజు ఆ సంఖ్యలో పేపర్లు దిద్దకపోతే ఆ తర్వాత రోజు ఆ మేరకు సంఖ్య పెంచుతున్నారు. దీనివల్ల టీచర్లపైనా ఒత్తిడి పెరుగుతోంది. పైగా సాయంత్రం మూల్యాంకనం ముగిసే సమయంలో హడావుడిగా పేపర్లు దిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా విద్యార్థులు నష్టపోతున్నారు.

అంచనా తప్పుతోంది

గతంలో బిట్ పేపర్ ఉన్నప్పుడు మూల్యాంకనం చేసేవారికి ఒక అంచనా ఉండేది. మూల్యాంకనం చేసేవారు మొదట బిట్ పేపర్ దిద్దేవారు. బిట్ పేపర్‌లో ఎక్కువ మార్కులు వస్తే ఆ విద్యార్థి మెరుగ్గా ఉన్నట్టు భావించి, వ్యాసరూప ప్రశ్నల విషయంలోనూ జాగ్రత్తగా మూల్యాంకనం చేసేవారు. అదే బిట్ పేపర్‌లో తక్కువ మార్కులు వస్తే, వ్యాసరూప ప్రశ్నల మూల్యాంకనానికి ఎక్కువ కష్టపడాల్సి వచ్చేది కాదు. కానీ, ఇప్పుడు బిట్, వ్యాసరూప ప్రశ్నలను ఒకే సమాధానపత్రంలో రాస్తున్నారు. చాలా మంది విద్యార్థులు ఒక మార్కు ప్రశ్నలకు బుక్‌లెట్ చివర్లో సమాధానం రాస్తున్నారు. కొందరు మధ్యలో రాస్తారు. దీంతో టీచర్లు దిద్దే పేపరుపై ఒక అంచనాకు రాలేకపోతున్నారనే వాదన ఉపాధ్యాయుల నుంచి వినిపిస్తోంది. దీనికి తగిన పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

83% పేపర్లలో మార్కులు మారలేదు

16.32% పేపర్లలో 10లోపు మార్కులు తేడా.. 0.52 % పేపర్లలో 11-15 వ్యత్యాసం

» మొత్తం దిద్దినా మార్కులు కలపలేదు

» మూడంచెల పర్యవేక్షణలోనూ లోపాలు

» పదో తరగతి మూల్యాంకనంపై విద్యాశాఖ

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో 83.16 శాతం పేపర్లలో మార్కులు మారలేదని పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. 34,709 మంది విద్యార్థులు... 66,363 పేపర్లపై రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 24,550 మంది విద్యార్థులకు సంబంధించిన 55,188(83.16శాతం) పేపర్లలో మార్కులు మారలేదు. 11,175 పేపర్లలో మాత్రమే మార్కులు మారాయి. 8,863 పేపర్లలో 1 నుంచి 5 మార్కులు, 1,506 పేపర్లలో 6 నుంచి 10 మార్కులు కలిశాయి.

మార్కుల మార్పులు ఇలా

మార్కుల్లో మార్పులు	పేపర్లు	శాతం
మార్పులేదు	55188	83.16%
1- 5	8863	13.36%
6- 10	1506	2.96%
11- 15	343	0.52%
16- 20	163	0.25%
21- 25	86	0.13%

గత ఏడేళ్ల నుంచీ ఇంతే!

గత పదేళ్లుగా మూల్యాంకనం విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో పొరపాట్లు కొనసాగుతున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు. 2019లో 19 శాతం, 2022లో 20శాతం, 2023లో 18శాతం, 2024లో 17శాతం, 2025లో 16.32శాతం మార్కులు మారాయి. మూల్యాంకనంలో పొరపాట్లు జరిగినా సంబంధిత టీచర్లు, ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. అయితే.. ఈ మూల్యాంకనంలో మూడంచెల వ్యవస్థ ఉంటుంది. ఏ పేపర్‌నైనా అసిస్టెంట్ ఎగ్జామినర్, స్పెషల్ ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్ ముగ్గురూ పేపర్లను పరిశీలించి సంతకాలు చేయాలి. పేపర్లపై సంతకాలు చేస్తున్నా పరిశీలన పూర్తిస్థాయిలో జరగటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ పొరపాట్లకు కూడా మూల్యాంకనంలో లోపాలు ఎక్కడ జరిగాయో ప్రభుత్వ పరీక్షల విభాగం గుర్తించింది.

ప్రాథమిక కారణాలు

- పేపర్లు పూర్తిగానే దిద్దినా కొన్ని విభాగాల మార్కులను తుది మార్కుల్లో కలపలేదు.
- దిద్దిన సమాధాన పత్రాల్లోని మార్కులను ఓఎంఆర్ షీట్లలోకి మార్చే క్రమంలో పొరపాట్లు.
- కొన్ని పేపర్లలో కొన్ని ప్రశ్నలను వదిలేయడం లేదా సున్నాలు వేయడం.
- మూడంచెల పరిశీలన విధానం సమర్థంగా పనిచేయక పోవడం.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరీల కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా నూజివీడులోని క్యాంపస్‌లో మూడో రోజు నిర్వహించారు. మొత్తం 919 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 698 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. స్పోర్ట్స్ కోటా కింద 467 మందికి కాల్ లెటర్లు పంపగా 344 మంది, ఎన్‌సీసీ కోటాలో 452 మందికి కాల్ లెటర్లు పంపగా 354 మంది హాజరయ్యారు.



శుక్రవారం వర్షానికి అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో జలమయమైన ప్రధాన రహదారి

మరో మూడు రోజులు వర్షాలు

» పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదు

అమరావతి, విశాఖపట్నం, మే30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా శనివారం శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో మోస్తరుగా, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా శుక్రవారం రాష్ట్రంలో పలుచోట్ల ఎండతీవ్రత, ఉక్కపోత కొనసాగింది. దీనికితోడు సముద్రం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీశాయి. దీంతో మధ్యాహ్నం నుంచి రాష్ట్రంలో పలుచోట్ల మేఘాలు ఆవరించి పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లా గుర్ల, కడప జిల్లా శెట్టివారిపల్లిలో 87.5, విజయనగరం జిల్లా వేపాడలో 79.2, నంద్యాల జిల్లా ముత్యాలపాడులో 79, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 74 మిల్లీ మీటర్ల వాన పడింది. బంగాళాఖాతంలో అలల ఉధృతి కొనసాగడం, కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తుండడంతో మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని విశాఖ వాతావరణ శాఖ సూచించింది.

గోదావరి-కావేరీ అనుసంధానంపై 24న భేటీ

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ నదుల అనుసంధానం అంశంలో మళ్లీ కదలిక వచ్చింది. దీనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు లేవనెత్తిన అభ్యంతరాలపై వచ్చేనెల 24వ తేదీ ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని జల సౌధలో సమావేశం జరగనున్నది. కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ ఆధ్వర్యంలో జరిగే ఈ భేటీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ కమిటీ కూడా పాల్గొంటుంది.

ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చు

» కార్డు నమోదైన షాపునకే వెళ్లక్కర్లేదు

» 5లోపు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్

» రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి/అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): "ఇకపై లబ్ధిదారులు తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చు. రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే తీసుకోవాలనే నిబంధన లేదు. దీనికి సంబంధించిన సాంకేతిక మార్పులు కూడా చేశాం" అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందించనున్న నేపథ్యంలో సన్నాహక ఏర్పాట్లను ఆయన శుక్రవారం గుంటూరు జిల్లా తెనాలిలో పరిశీలించారు. రేషన్‌దుకాణంలో సరుకు నిల్వలు, వాటి తూకాలు, ఇతర ఏర్పాట్లను అడిగితెలుసుకున్నారు. డీలరు, రెవెన్యూ, తూనికలు కొలతల శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారుల ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరుకుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాంకేతిక సమస్య తలెత్తినా వారిని గంటల తరబడి కూర్చోబెట్టకుండా ఫొటో తీసుకుని సరుకులు ఇచ్చేలా ఆదేశాలిచ్చామన్నారు. గతంలో ఎండీయూ వాహనాలను వీధి చివర్లో ఆపి కొంతసేపు సరుకులు ఇచ్చి కొంతమందికి రేషన్ ఇవ్వకుండా మాయం చేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. వీటిని నియంత్రించేందుకే ఎండీయూ వ్యవస్థను రద్దు చేశామన్నారు. రేషన్ దుకాణాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

15 రోజులు అందుబాటులో దుకాణాలు

ప్రతినెలా 1 నుంచి 15లోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయని మంత్రి చెప్పారు. ఆ సమయంలో ఎప్పుడైనా రేషన్ తీసుకునే వీలుంటుందన్నారు. గతంలో వలే వాహనం కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దే ఉండాల్సిన అవసరం లేదన్నారు. వీలున్న సమయంలో రేషన్ తెచ్చుకోవచ్చన్నారు. సరుకులు లేవని ఏ ఒక్కరినీ తిప్పిపంపే పరిస్థితి ఉండదన్నారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులైన 15.56 లక్షల కుటుంబాల వారికి ప్రతినెలా 5వ తేదీలోపు సరుకులు ఇళ్ల వద్దే అందిస్తామని స్పష్టంచేశారు. ఈ బాధ్యత రేషన్ దుకాణదారులే తీసుకుంటారని వెల్లడించారు. రాష్ట్రంలో 29,760 దుకాణాలను పునరుద్ధరించామన్నారు. తూకాల్లో వ్యత్యాసం ఉన్నా, సరుకులు లేవని తిప్పి పంపినా డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



రేషన్ దుకాణం ఎదుట దుకాణదారుడి ఫొటో, అధికారుల ఫోన్ నంబర్ కనిపించేలా ఫ్లెక్సీ ప్రదర్శించాలని సూచిస్తున్న మంత్రి మనోహర్

ఆదివారాల్లోనూ సరుకులు పంపిణీ చేయాలి

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా డీలర్లు పని చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలకు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. కార్డుదారులకు డీలర్లు గౌరవంగా సేవలందించాలన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, సివిల్ సప్లయిస్ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారాల్లో కూడా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి డీలరు ఈ-పోస్, వేయింగ్ మెషీన్ల పనితీరును ముందుగానే పరిశీలించుకోవాలని చెప్పారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే ప్రత్యామ్నాయ మార్గాల్లో సరుకుల పంపిణీ చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ-పోస్, వేయింగ్ మెషీన్ల మరమ్మతుల కోసం ప్రతి జిల్లాలో సర్వీసు క్యాంపులు ఏర్పాటు చేస్తామని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ కార్డుదారులకు సక్రమంగా సరుకులను పంపిణీ చేయాలని మంత్రి చెప్పారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ కృష్ణమోహన్

శ్రీవారి సేవలో జస్టిస్ కృష్ణమోహన్

తిరుమల, మే30(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు న్యాయమూర్తికి లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రఫుల్లా ఎస్ ఖుబాల్కర్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్రకుమార్ వాణి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల అధికారిణి

» ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి ద్వారా లంచం డబ్బులు వసూలు

» దాడి చేసి పట్టుకున్న అధికారులు

విశాఖపట్నం, మే 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న ప్లైఉడ్ మెటీరియల్ విడుదల (రిలీజ్ ఆర్డర్) చేసేందుకు లంచం డిమాండ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ (డీసీటీవో) కిముడు జయలక్ష్మిని అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆమె అనుచరుడైన కాశేశ్వరి ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి సన్యాసిరాజు రూ.25 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు... హైదరాబాద్‌కు చెందిన ఇంటీరియర్ డిజైన్ వర్క్స్ కాంట్రాక్టర్ విశ్వేశ్వర విశ్వనాథ్ విశాఖలో పనులు చేస్తుంటారు. రూ.42 వేల విలువ చేసే ప్లై ఉడ్ మెటీరియల్‌ను కాశేశ్వరి ట్రాన్స్‌పోర్టు ద్వారా విశాఖ పంపించారు. ఈ నెల 15న గోదామును తనిఖీ చేసి డీసీటీఓ క్యారియింగ్ ఇన్వాయిస్ లేకపోవడంతో సరుకును స్వాధీనం చేసుకున్నారు. సరుకును వదలడానికి డబ్బులు డిమాండ్ చేశారు. బాధతుడు ఏసీబీని ఆశ్రయించగా, వాళ్లు దాడి చేసి పట్టుకున్నారు. ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

అఖిల భారత డెయిరీ స్టీరింగ్ కమిటీలో సభ్యుడిగా 'చలసాని'

» కృష్ణా మిల్క్ యూనియన్‌కు అరుదైన గౌరవం

విజయవాడ(చిట్టినగర్), మే 30 (ఆంధ్రజ్యోతి): సహకార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటైన అఖిల భారత డెయిరీ స్టీరింగ్ కమిటీలో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయా డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులుకు స్థానం దక్కింది. కృష్ణా మిల్క్ యూనియన్ రైతులకు అందించిన సేవలకు గుర్తింపుగా కమిటీలో సభ్యునిగా అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆంజనేయులును ఆంధ్రప్రదేశ్ సహకార భారతి అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాస్ తోపాటు, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, అధికారులు, సిబ్బంది అభినందించారు. అడ్డూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 24న గుజరాత్‌లో జరిగిన ఆల్ ఇండియా సహకార భారతి కాన్ఫరెన్స్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ విజయగాథను ప్రదర్శించారన్నారు.



చలసాని ఆంజనేయులను సత్కరిస్తున్న ఏపీ సహకార భారతి అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాస్, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు

తిరుమలకు మరింత మెరుగైన భద్రత

» అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేలా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీం

» భద్రతా సమీక్షలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

తిరుమల, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తిరుమల ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని మరింత మెరుగైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడం చాలా అవసరమని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అభిప్రాయపడ్డారు. తిరుమల భద్రతపై డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, టీటీడీ ఈవో శ్యామలరావు సమక్షంలో శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. తిరుపతి ఎస్పీ, టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వో హర్షవర్ధనరాజు భద్రతా పరమైన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై డీజీపీ పలు సూచనలు చేశారు. ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోంగార్డు, సివిల్ పోలీసు, టీటీడీ విజిలెన్స్‌తో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి సారించాలని డీజీపీ చెప్పారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలన్నారు. అలిపిరి వద్ద బహుళస్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలిసి సెన్సర్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. గతంలో జరిగిన భద్రతా వైఫల్యాలపై చర్చించారు. గతంలో తాను హోంశాఖ ప్రధాన కార్యదర్శి హోదాలో తిరుమలలో పర్యటించి ప్రతిపాదించిన కొన్ని ముఖ్య అంశాలపై కూడా అధికారులతో డీజీపీ సమీక్షించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. తిరుమలలో సైబర్ సెక్యూరిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ సుధాకరరెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేశ్ చంద్ర లడ్డా, డీఐజీ శేముషి, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, డీఎఫ్‌వో వివేక్ ఆనంద్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. సమావేశానికి ముందు డీజీపీ శ్రీవారిని దర్శించుకున్నారు.



సమావేశంలో డీజీపీ, ఎస్పీ, టీటీడీ ఈవో తదితరులు

యాంటీ డ్రోన్ టెక్నాలజీ డెమో

తిరుమల క్షేత్రంలో యాంటీ డ్రోన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలనే నిర్ణయంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పోలీసులు, విజిలెన్స్ అధికారులకు డెమో ఇచ్చింది. యాంటీ డ్రోన్ టెక్నాలజీ ద్వారా... అనుమానిత డ్రోన్లను ఎలా గుర్తించి, వాటి డైరెక్షన్స్‌ను ఎలా మళ్లించవచ్చో ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.

నేడు పెన్షన్ల పంపిణీ

కైకలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక రోజు ముందుగానే నిర్వహిస్తున్నారు. జూన్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం సామాజిక పించన్ల ఏర్పాట్లు నిర్వహించారు. కైకలూరు మండలంలో 9292 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల 9 లక్షల 33500 పెన్షన్ నగదు పంపిణీ చేస్తున్నారు. పంపిణీ కార్యక్రమానికి కూటమి శ్రేణులంతా పాల్గొనాలని నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పిలుపునిచ్చారు

హెచ్ఎం పోస్టుల భర్తీ

ముదినేపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని పలు జడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యాయి. గురువారం రాత్రి జరిగిన ప్రమోషన్ కౌన్సెలింగ్‌లో గురజ హైస్కూలు హెచ్ఎంగా జె.సునీత, బొమ్మినంపాడు హెచ్ఎంగా జి.వి.సత్య ప్రసాద్, చిగురుకోట హెచ్ఎంగా వై.వి.సుబ్బారావు, సింగరాయపాలెం హైస్కూలు హెచ్ఎంగా జె.మాధవీ లతను నియమిస్తూ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా జూన్ 1న చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కొల్లేరు అతిథులకు అవస్థలు

- అభివృద్ధికి నోచుకోని పక్షుల కేంద్రం
- నీరు లేక ఎండిన సరస్సు
- మరో చోటికి పక్షుల వలస
- కొల్లేరులో వసతుల కొరత
- పర్యాటకులకు తప్పని పాట్లు

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు అతిథులైన వలస పక్షులకు అవస్థలు తప్పడం లేదు. పర్యాటకంగా ఎంతో ఆకట్టుకుంటున్నప్పటికీ సరైన వసతులు లేకపోవడంతో పర్యావరణ ప్రేమికులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. ప్రభుత్వాలు కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో వాటిపై దృష్టి పెట్టడం లేదు. వేసవిలో నీరు ఎండిపోవడంతో పక్షులు అల్లాడుతున్నాయి. ఆహారం కూడా అందని పరిస్థితిలో ఇతర ప్రాంతాలకు వలస పోతున్నాయి.

కైకలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సర స్సు 77,138 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కేవలం 310 ఎకరాల చెరువులో మాత్రమే వలస పక్షుల ఆవాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. కొల్లేరుకు వరద వస్తే ఈ చెరువు సరస్సులో కలిసి పోతుంది. వేసవిలో నీరు లేక ఎండిపోతుంది. పక్షులకు ఆహారం కూడా దొరకని పరిస్థితుల్లో కొల్లేరు నుంచి తిరిగి సుదూర ప్రాంతాలకు వలస పోతున్నాయి. కొల్లేరు సరస్సు పక్షులకు స్వర్గధామం. ఇక్కడి వాతా వరణం వాటికి ఎంతో అనుకూలం, సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. ఇలాంటి వలస పక్షుల కోసం ఏర్పాటుచేసిన కైక లూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం చెరువు. ఈ చెరువుకు చుట్టూ కొల్లేరు సరస్సు, సరస్సులోని పోల్‌రాజ్ డ్రెయిన్‌తో చెరువులో నీరు నిల్వ ఉండక వేసవిలో పూర్తిగా అడుగంటి పోతుంది. చెరువు గట్టును బలోపేతం చేయకపో వడంతో నీరు లేక వెలవెలబోతుంది. ఏటా వరదల సమయంలో ఉన్న కొద్దిపాటి గట్లు మునిగిపోతాయి. వేసవిలో నీరు ఇంకిపోవడంతో బోటు షికారును అధికారులు నిలిపివేస్తారు. వేసవి సెలవుల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు నిరుత్సాహానికి గురవుతున్నారు. అంతేగాక చెరువులో విలువైన మత్స్య సంపద మృత్యువాత పడుతుంది. మత్స్య సంపద ఆహారమైన పక్షులు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నాయి. ఏటా ఈ పరిస్థితి పునరావృతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

పక్షుల కేంద్రం చెరువు నీటి నిల్వలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాకపోవడంతో ఈ సంవత్సరం తవ్వకాలు చేపట్టలేం. త్వరలో వీటిపై అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడమే గాక వర్షాలు ముందుగా వస్తున్నందున త్వరితగతిన చెరువు నింపి బోటు షికారు చేసేలా చర్యలు తీసుకుంటాం.

రామలింగాచార్యులు, రేంజర్

చేపల పరిశ్రమ అభివృద్ధికి కృషి

కొల్లేరు కేంద్రంగా చేపల పరిశ్రమ మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తామని మత్స్య శాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్ అన్నారు. కొల్లేరు ప్రాంతాన్ని శుక్రవారం ఆయన సంద ర్శించారు. పెద్ద ఎడ్లగాడి వద్ద, ఆటపాక పక్షుల కేంద్రం వద్ద కొల్లేరు సరస్సును పరిశీలించి వివరాలను సేకరించారు. కొల్లేరు సరస్సులో 46 మత్స్య శాఖ సొసైటీల వివరాలు తెలుసుకు న్నారు. గత ఆరేళ్ల క్రితం కొల్లేరును పరిశీలిం చానని అప్పటికి ఇప్పటికి మత్స్య ఉత్పత్తుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సరస్సు లో వలస పక్షులు, స్థానికంగా ఉన్న పక్షుల వివరాలను తెలుసుకున్నారు. మేజర్, మైనర్ డ్రెయిన్లు, పంట కాల్వల నుంచి సరస్సులో నీరు వచ్చే విధానం తెలుసుకున్నారు. ఎన్ని కాలువల ద్వారా ప్రతీ సంవత్సరం కొల్లేరులోకి నీరు వస్తుందో అనే అంశాలను తెలుసుకున్నారు.

రేషన్ దుకాణాల్లోనే బియ్యం పంపిణీ

మండవల్లి మే 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి తిరిగి జూన్ 1 నుంచి చౌకధరలు దుకాణాల ద్వారా రాయితీ సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా 1 నుంచి 17 వరకు అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. చౌకధరల దుకాణాల నుంచి రేషన్ సరుకుల పంపిణీ తిరిగి పునః ప్రారంభం కానుండడంతో ఈపోస్ యంత్రాలు, తూకం వేసే కాటాలు సక్రమంగా ఉన్నాయో లేదా, కార్డుదారులకు కనీస సదుపాయాలు కల్పిం చేందుకు దుకాణాదారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దుకాణాల చిరునామా తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగులు, 65 ఏళ్ళు పైబడిన వారికి ఇంటి వద్దకు రేషన్ డీలర్లే వెళ్లి సరుకులు అందించనున్నారు. కైకలూరు నియోజకవర్గంలో మొత్తం 137 రేషన్ దుకాణాలు ఉండగా 77 వేల వరకు రేషన్ కార్డులున్నాయి. జూన్ నెల సరుకులు పంపిణీకి ఇప్పటికే రంగం సిద్ధమయింది. ఆయా రేషన్ షాపులకు కైకలూరు గోడౌన్ నుంచి సరుకులను అందిస్తున్నారు. సరుకులు పంపిణీకి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నట్లు ఆర్డీవో అంబరీష్ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ నూజివీడు రూరల్ పోలీసులను ప్రేమ జంట ఆశ్రయించింది. నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చల్ల రోహిత్ తెలంగాణ రాష్ట్రం కోషాయిగూడకు చెందిన నయనరపు నవ్యశ్రీ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని వారు తమ పెద్దలకు తెలియజేయగా వారు పెళ్ళికి నిరాకరించడంతో ప్రేమికులిద్దరూ ఏలూరు నవ నమాజ్ సొసైటీలో శుక్రవారం వివాహం చేసుకు న్నారు. అనంతరం పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ నూజి వీడు రూరల్ పోలీసులను ఆశ్రయించారు.

చెరువుల్లో రొయ్యల వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

కలిదిండి, మే 30 (ఆంధ్రజ్యోతి): పందుగప్ప చెరువుల్లో రొయ్యల వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ ఏడీ రాజ్ కుమార్, కలిదిండి మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ హెచ్చరించారు. లంక గ్రామాల్లో యథేచ్ఛగా రొయ్యల వ్యర్థాలను వేస్తున్నారని, వాటిని నిషేధించాలని ఆక్వా రైతులు ఫిర్యాదు చేయడంతో రొయ్యల వ్యర్థాలను విక్రయిస్తున్న వ్యాపారులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. రొయ్యల వ్యర్థాల వ్యాన్లను చెక్ పోస్టుల వద్ద తనిఖీ చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రొయ్యల తల కాయలను, పండుగప్ప చెరువుల్లో మేతగా వేయటం వల్ల రెడ్ డిసీజ్ సోకుతోందన్నారు. చెరువుల్లో నీరు కలుషితమవడంతో ఆక్సిజన్ లోపించి పండుగప్పలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. వైరస్ సోకిన రొయ్యల వ్యర్థాల వల్ల రొయ్యల సాగుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారుల సహకారంతో రొయ్యల వ్యర్థాల నిషేధానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



మట్టి తోలకాలను అడ్డుకున్న రైతులు

సాగునీటి సంఘాన్ని సంప్రదించకుండా అనుమతులపై ఆగ్రహం

పెద్ద చెరువు మట్టితోలకాలను అడ్డుకుంటున్న రైతులు

నూజివీడు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ఒత్తిళ్ల, సిఫార్సులకు లొంగి ఇరిగేషన్ అధికారులు చెరువులో మట్టి తోలకాలకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు. చెరువు ఆయకట్టు సంఘంను సంప్రదించకుండానే అధికారులు అనుమతులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం ప్రభుత్వమే ఆ సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసింది. శుక్రవారం నూజివీడు పెద్ద చెరువు పరిధిలో లేని కొందరికి ఈ చెరువు నుంచి మట్టి తోలకానికి అధికారులు అనుమతులు ఇచ్చారు. శుక్రవారం ఉదయం ట్రాక్టర్లలో ఎక్స్‌కవేటర్లతో మట్టితోలకానికి వచ్చిన వీరికి చెరువు సాగునీటి సంఘం ఆధ్వర్యంలో రైతులు ఈ మట్టి తోలకాలను అడ్డుకున్నారు. కొద్ది సేపు వీరి మధ్య వాగ్వాదం జరిగింది. రైతులు మీడియాకు సమాచారం అందించడంతో మట్టితోలకాలకు వచ్చిన వారు వెళ్ళిపోయారు.

అనుమతులివ్వడం సరికాదు..

నూజివీడు పెద్ద చెరువుకు గండి పడి 8 నెలలైంది. ఇంత వరకు గండి పూడ్చ లేదు. అధికారులు రేపు మాపంటూ కాలం గడుపుతున్నారు. వర్షాలు ప్రారంభమయ్యాయి. పంటలకు సాగునీరు అవసరమయ్యే సమయం దగ్గర పడింది. అయినా గండి పూడ్చలేదు. తమ చెరువు నీటి సంఘంతో సంప్రదింపులు జరపకుండానే అధికారులు ఈ చెరువులో మట్టి తోలకాలకు అనుమతులు ఇవ్వడం సరికాదని ఈ సంఘం అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ (చంటి) విలేకరులకు తెలిపారు. ఈ పెద్ద చెరువుకు మట్టి తోలకాలకు అనుమతులు ఇవ్వవద్దని నీటి సంఘం సమావేశంలో శుక్రవారం తీర్మానం చేసి అధికారులకు పంపామని తెలిపారు.

కైకలూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

- 7 తీర్మానాలు సీఎంకు అందజేత
- వివరాలు తెలిపిన పార్టీ మండల అధ్యక్షుడు త్రినాథరాజు
- మహానాడు విజయవంతంపై కృతజ్ఞతలు

కైకలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కడపలో మహానాడును విజయవంతం చేసినందుకు కైకలూరు నియోజకవర్గ టీడీపీ శ్రేణులందరికీ మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కైకలూరు నియోజకవర్గం నుంచి ఏడు తీర్మానాలను రాష్ట్ర మహానాడులో అందజేసినట్లు తెలిపారు. కైకలూరు నియోజకవర్గం శివారున ఉండడం పంట కాలువలన్నీ కృష్ణా జిల్లాలో ఉండడం వల్ల నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లా నుంచి కృష్ణాజిల్లాలోకి కలపాలని, కొల్లేరులో ధ్వంసం చేసిన 7500 ఎకరాల భూములును పేదలకు ఇప్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని, ఆక్వా పరిశ్రమ వల్ల రాష్ట్రంలోనే తలసరి ఆదాయంలో అధికంగా కైకలూరు, కలిదిండి మండలాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, అలాగే మంత్రి లోకేశ్ పాదయాత్రలో రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారని ఈ మేరకు వాటిని అమలు చేయాలని, లీజుకు చేస్తున్న ఆక్వా రైతులకు సబ్సిడీపై ఏరియేటర్లు అందజేయాలని, ఉచితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అందించి ఆక్వాపరిశ్రమను ప్రోత్సహించాలని తీర్మానించారు. గత వైసీపీ ప్రభుత్వంలో పామర్రు-దిగమర్రు 165వ జాతీయ రహదారి పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని త్వరగా పనులు పూర్తి చేసేలా తీర్మానాలు చేసినట్టు తెలిపారు. కైకలూరు జగనన్న లే అవుట్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని వాటిపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేసి అవినీతిని వెలికితీసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అలాగే కొంతమంది లబ్ధిదారుల నుంచి కాంట్రాక్టర్లు డబ్బులు కట్టించుకుని ఇళ్ళ నిర్మాణం పూర్తిచేయట్లేదని దీనిని త్వరగా పరిష్కరించాలని కోరారు. కైకలూరు నియోజకవర్గం శివారున ఉండడం వల్ల రైతులు నీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారని పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి ఉప్పుటేరు ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కైకలూరుకు మంచినీరు తీసుకురావాలని తీర్మానం చేశారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన రక్షిత మంచినీటి పథకాలను పునరుద్ధరించి జల జీవన్ మిషన్ ద్వారా నిధులను కేటాయించి ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని, అలాగే కైకలూరు పట్టణంలో మంచినీటిని అందించేందుకు కొత్తగా ఫిల్టర్‌బెడ్‌లు నిర్మించి తాగునీరు అందించాలని కోరుతూ తీర్మానం చేసి రాష్ట్రమహానాడులో సీఎం చంద్రబాబు నాయుడుకు అందించినట్లు త్రినాథరాజు తెలిపారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

జాబ్ మేళాలో 170 మంది ఎంపిక

నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా శుక్రవారం విజయవంతంగా ముగిసింది. జాబ్ మేళాకు రాష్ట్రంలో 13 ప్రముఖ కంపెనీ ప్రతినిధులు హాజరు కాగా 600 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్లు పరిశీలన అనంతరం 170 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్. జితేంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాకు మొత్తం 13 కంపెనీలు హజరుకాగా 170 మంది అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి కె ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్లు వి రవిశ్యామ్, ఆర్ ఫణికుమార్, యస్ సునీల్‌కుమార్, కె రాంబాబు, వి కిషోర్, డి రామకృష్ణనాయుడు, వివిధ కంపెనీల ప్రతినిధులు, వారి టెక్నికల్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంల బదిలీ

కలిదిండి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు జడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారని ఎంఈవో వెలమల శ్రీనివాసరావు తెలిపారు. పెదలంక జడ్పీ హైస్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు, భాస్కరరావుపేట పాండురంగారావు, కొండంగి లక్ష్మీ నారాయణ, గుర్వాయిపాలెం బస్వారావు, తాడినాడ ఉమా బదిలీ అయ్యారన్నారు.



నేల బావి పూడ్చివేత పనుల పరిశీలన

ప్రమాదకర నేలబావి పూడ్చివేత

ముసునూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఎస్సీ కాలనీలో నివాస గృహాల మధ్య ప్రమాదకరంగా ఉన్న నేలబావిని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా ఆధ్వర్యంలో శుక్రవారం పూడ్చివేశారు. గత కొన్నేళ్ళుగా ఈ నేలబావి నిరుపయోగంగా ఉండటం వల్ల వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడంతోపాటు చిన్నపిల్లలు సైతం ప్రమాదానికి గురవుతున్నారు. కాలనీవాసుల ఇబ్బందులను చూసిన సర్పంచ్ సూమారు రూ. లక్షతో 200 ట్రిప్పుల మట్టితో నేలబావి పూడ్చివేతకు శ్రీకారం చుట్టారు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి బావిని పూర్తిస్థాయిలో పూడ్చివేశారు. గత ఏడాది జనావాసాల మధ్య నిరుపయోగంగా, ప్రమాదకరంగా ఉన్న సుమారు 10 నేల బావులను సైతం పూడ్చివేసి, ప్రజల ఇబ్బందులను తొలగించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ పనులను సర్పంచ్ తనయుడు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ నక్కా యోహాను, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దివాకర్ పర్యవేక్షించారు. పంచాయతీలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలతోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికి సర్పంచ్ చేస్తున్న కృషిని స్థానికులు అభినందించారు.

నమ్మించి మోసం..

- నివేశనా స్థలాలకు భూమి తీసుకున్న వైసీపీ ప్రభుత్వం
- పరిహారం ఇవ్వకపోవడంపై బాధిత కుటుంబం ఆగ్రహం



తమ భూమిలో బాధిత కుటుంబం నిరసన

నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవనాధారమైన భూమిని జగనన్న కాలనీకి తీసుకొని పరిహారం ఇవ్వకపోగా తనకు ఎనిమిది సెంట్ల నివేశనా స్థలం ఇస్తానని నమ్మించి రెవెన్యూ అధికారులు నాటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సమక్షంలో హామీ ఇచ్చి మోసగించారంటూ బాధితుడు జె. భాస్కరరావు ఆరోపించారు. జగనన్న కాలనీకి తీసుకున్న భూమిలో బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూజివీడు మండలంలోని అన్నవరం గ్రామంలో ఆర్ఎస్ 1026/8లో తనకు ఎకరం భూమి ఉందని అయితే సదరు భూమిని జగనన్న కాలనీకి నివేశనా స్థలాల మంజూరు నిమిత్తం తీసుకుంటున్నట్లు 2019లో నాటి రెవెన్యూ అధికారులు నోటీసు ఇచ్చారన్నారు. దీనిపై అభ్యంతరం చెబితే ఎనిమిది సెంట్ల నివేశనా స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారని, అనంతరం 4 సెంట్లు ఇస్తానని ఆ తరువాత ముఖం చాటేశారని వైసీపీ ప్రభుత్వం తనను నమ్మించి మోసగించిందని కూటమి ప్రభుత్వంలోనైనా తనకు న్యాయం చేయాల్సిందిగా బాధితుడు కోరుతున్నాడు.

కార్మిక సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి



ఆరిగిపల్లిలో జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

ముసునూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ముసునూరు మెయిన్ సెంటర్‌లో ఉన్న దిమ్మవద్ద ఎర్రజెండాను శ్రీనివాసరావు ఆవిష్కరించి మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్మికుల హక్కులు కాలరాసేలా కేంద్రం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను ప్రభుత్వాలు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. యూనియన్ నాయకులు పేరిచర్ల నాగరాజు, రెడ్డి తిరుపతిరావు, ఆశోక్, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఆగిరిపల్లి, ఈదులగూడెం, నెక్కలం గొల్లగూడెం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆగిరిపల్లిలో యూనియన్ నాయకులు నైనవరపు ఉళక్కయ్య, స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. కార్మిక సంఘం ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈదులగూడెంలో యూనియన్ సీనియర్ నాయకుడు శుభాకర్ జెండా ఆవిష్కరించారు. నెక్కలం గొల్లగూడెం ఐటీఐ వద్ద నాయకులు జెండా ఆవిష్కరించారు.

అప్పు మిగిల్చిన విషాదం

కుటుంబం ఆత్మహత్యాయత్నం

- కూల్ డ్రింక్‌లో కలుపు మందు కలుపుకుని తాగిన వైనం
- కుటుంబ యజమాని చికిత్స పొందుతూ మృతి
- చికిత్స పొందుతున్న భార్య, పిల్లలు



సత్యదుర్గ చంద్రరావు(ఫైల్)

జంగారెడ్డిగూడెం,మే 30 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధలు తాళలేక జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ముంగిన సత్యదుర్గ చంద్రరావు(38) అనే వ్యక్తి తనతో పాటు తన భార్య, ఇద్దరు పిల్లలకు కూల్ డ్రింక్‌లో కలుపు మందు కలిపి తాగించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం సృష్టించింది. ఈ ఘటనలో ఇంటి యజమాని సత్యదుర్గ చంద్రరావు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కృష్ణజ్యోతి, కుమారుడు దుర్గాచరణ్, కుమార్తె కోమలి ఐశ్వర్య చికిత్స పొందుతున్నారు. బంధువులు తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన సత్యదుర్గ చంద్రరావు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వివాహం అనంతరం బంధువుల సహకారంతో చిన్నగా వడ్డీ వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడు. తన భార్య, పిల్లలతో పట్టణంలోని బాలాజీ టవర్స్‌లో నివాసముంటున్నాడు. వ్యాపారం కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ బయట నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీలు సమయానికి చెల్లించలేక పోవడం, వడ్డీకి తీసుకున్న వారు సమయానికి చెల్లించకపోవడంతో అప్పులు పెరిగిపోవడంతో చనిపోవడానికి నిర్ణయించుకున్నాడు. ఈనెల 29న కలుపు మందు ఇంటికి తీసుకువచ్చి కూల్‌డ్రింక్‌లో కలిపి.. ఆయుర్వేదం కషాయం అని చెప్పి తాగితే మంచిదని భార్య, పిల్లలకు తాగించాడు. అనంతరం బంధువులకు కలుపు మందు తాగి చనిపోతున్నట్టు చెప్ప గా వారు హుటాహుటిన వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రికి తర లించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ యజమాని మృతి చెందాడు. ప్రస్తుతం భార్య, పిల్లలు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.

కొత్త దుకాణం.. పాత సరుకు

(మూడో పేజీ తరువాయి)

పశ్చిమలో 1,052 దుకాణాలను ప్రారంభిస్తారు. వీటి ద్వారానే వినియోగదారులందరికీ సరుకులు అందజేస్తారు. ఈ-పోస్ యంత్రాలను డీలర్లకు అందజేశారు. వినియోగదారుల సంఖ్యను బట్టి కావాల్సిన సరుకు లను శుక్రవారం కేటాయించారు. శనివారం నాటికే సరుకంతా దుకాణాలకు చేరేలా చర్యలు తీసుకో వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు కొంతమందికి అనువుగా వున్న రేషన్ సరఫరా వాహనాలను ఇప్పటికే తొలగించి వాటిలో వున్న ఎలక్ట్రానిక్ కాటా, బయోమెట్రిక్ యంత్రం, ఇతరత్రా రెవెన్యూ అధికారులు స్వాధీన పర్చుకున్నారు. వాటినే డీలర్లకు అందించారు. సాధ్యమైనంత మేర రేషన్ దుకాణాలు అన్నింటిని ఆదివారం ఆట్టహాసంగా ప్రారంభించాలని అంతర్గత ఆదేశాలు వెలువడ్డాయి. కూటమి పక్షాలకు చెందిన నేతల ద్వారా ఆయా రేషన్ దుకాణాలు ప్రారంభించా లని సూచించారు. ఆ మేరకు ఇప్పుడు డీలర్లంతా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కొత్త సరుకంటూ లేదు

ఎప్పటి మాదిరిగానే ఈసారీ బియ్యం, పంచ దారతోనే సరిపెట్టబోతున్నారు. గత ఫిబ్రవరిలో కందిపప్పు, మైదా అదనంగా అందించినా ఆ తర్వాత నెల నుంచి వాటి సరఫరా నిలిపివేశారు. వినియో గదారులంతా కందిపప్పు తక్కువ రేటుకు కార్డుపై అందించాలని అప్పటి నుంచి అభ్యర్థిస్తూ వచ్చారు. కానీ సర్కారు ఆ వైపు తొంగి చూడలేదు. దీనికి తోడు రేషన్ దుకాణాల్లో విలేజ్ మాల్స్ తలపించేలా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుతామని మరో ప్రకటన చేశారు.



యోగేశ్వరి

యోగాసనాల్లో దిట్ట

నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్ర జ్యోతి): తల్లి దండ్రులు పెట్టిన పేరుకు ఆ చిన్నారి సార్థకత తెచ్చింది మూడేళ్ల చిన్నారి యోగేశ్వరి. నూజివీడుకు చెందిన రెడ్డి సతీష్, సాయి ప్రసన్నల కుమార్తె రెడ్డి యోగేశ్వరి అనుజ్ఞశ్రీ. తాత యోగాసనాలను చూస్తూ అనుకరించేది. చిన్నారి ఆసక్తిని గమనించిన ఆమె తల్లి సాయి ప్రసన్న శిక్షణ ఇవ్వడంతో యోగేశ్వరి సులువుగా ఆసనాలు వేస్తుంది. ద్వారకా తిరుమలలో యోగాంధ్ర కార్యక్రమంలో తల్లితో పాటు యోగేశ్వరి సభాస్థలిపై ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ వెట్రి సెల్వి అబ్బురపడ్డారు.



తల్లితో కలిసి సాధన చేస్తున్న యోగేశ్వరి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కైకలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల నిమిత్తం కలిదిండి, పోతుమర్రు, మూలలంక సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదినేపల్లి: సింగరాయపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పెదగొన్నూరు 11 కేవీ ఫీడర్ ఏరియాలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్లను తొలగింపు పనులు నిర్వహిస్తున్నందున శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని విద్యుత్ వినియోగదార్లు గమనించి సహకరించాలని కోరారు.

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

ముదినేపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో శనివారం జూన్ నెల పెన్షన్లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో వై. రామకృష్ణ తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల పరిధిలో 8,671 మంది పెన్షన్‌దార్లకు రూ.3.81 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటి వద్దే సచివాలయాల సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు పెన్షన్లు అందజేస్తారన్నారు.

అఖండ అన్నసమారాధన

కైకలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి వేడుకల ముగింపు సందర్భంగా వింజరంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో అఖండ అన్నసమారాధనను నిర్వహించారు. గత 8 రోజులుగా ప్రతి రోజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ముదినేపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): గుడివాడ, భీమవరం జాతీయ రహదారిలో ముదినేపల్లి మండలం దాకరం గ్రామం వద్ద ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొన్న ఘటనలో ఒక యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం ముదినేపల్లి నుంచి మండవల్లి మండలం గన్నవరం బైక్‌పై వెళ్తున్న కాట్రు అనిల్ కుమార్ అనే యువకుడిని కైకలూరు వైపు నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు గురువారం రాత్రి 10 గంటల సమయంలో ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో ఆ యువకుడికి తీవ్ర గాయాలవడంతో అతనిని 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.